ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
గురువారం 16 మే 2024

బెట్టింగ్‌లు.. రూ. కోట్లలో..!

ఎన్నికల ఫలితాలపై పందేల జోరు..
రూ.కోట్లలో సాగుతున్న వైనం
చోద్యంచూస్తున్న పోలీసులు
కట్టడి చేయకపోతే కుటుంబాలు సర్వనాశనమే..



ధర్మవరం

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగిసింది. ఓటర్ల నిర్ణయం ఈవీఎంలలో నిక్షిప్తమైంది. గెలుపుపై ప్రధాన పార్టీలు ధీమాతో ఉన్నాయి. బెట్టింగ్‌కు ఆయా పార్టీల నాయకులు, మద్దతుదారులు సై అంటున్నారు. గెలిచేది తమ పార్టీయేననీ, ఎంతైనా పందెం వేసేందుకు సిద్ధమని ప్రకటించుకుంటున్నారు. రూ.లక్షలు, కోట్లలో బెట్టింగ్‌లు వేస్తున్నారు. అభ్యర్థుల గెలుపోటములపై ధర్మవరం నియోజకవర్గంలో బెట్టింగుల జోరు కొనసాగుతోంది. ఫలితాలు వెలువడేందుకు ఇంకా 18 రోజుల వ్యవధి ఉండడంతో బెట్టింగ్‌లు విపరీతంగా సాగే అవకాశం ఉందన్న వాదనలు వినిపిస్తున్నాయి. వాణిజ్య కేంద్రమైన ధర్మవరంలో బెట్టింగ్‌లకు తక్కువేమీ ఉండదు. ఉమ్మడి అనంత జిల్లాలోనే ఇక్కడ విపరీతంగా సాగుతాయన్న వాదనలున్నాయి. సోమవారం ఎన్నికల పోలింగ్ అలా పూర్తయిందో లేదో... బెట్టింగ్‌లు జోరందుకున్నాయి. ఇప్పటికే కోట్లాది రూపాయలు చేతులు మారుతున్నట్లు సమాచారం.

వందల కోట్లు...



ధర్మవరం నియోజకవర్గంలో గెలుపుపై ప్రధాన పార్టీల నేతలు ఎవరి ధీమాలో వారున్నారు. తమదే పైచేయి అంటే.. కాదుకాదు తమదేనని గట్టిగా చెబుతున్నారు. వాదనలు, [illegible]లు, ప్రతివిమర్శలకు దిగుతున్నారు. ఇవి కాస్తా బెట్టింగ్‌లకు దారితీస్తున్నాయి. పట్టుకేంద్రంలో బెట్టింగ్‌ల ఎక్కువగా సాగుతున్నట్లు సమాచారం. ఇక్కడ రూ.5లక్షల నుంచి రూ.కోటి, ఆపై కూడా బెట్టింగ్‌లు కడుతున్నట్లు సమాచారం. కౌంటింగ్ నాటికి బెట్టింగ్‌లు రూ.150 కోట్ల నుంచి రూ.200 కోట్లదాకా కొనసాగే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.

ప్రభుత్వ మార్పుపై కూడా..


రాష్ట్రంలో కచ్చితంగా ప్రభుత్వం మారుతుందంటూ కొందరు వాదిస్తుండగా.. మరికొందరేమో లేదంటున్నారు. ప్రభుత్వ మార్పుపై కూడా బెట్టింగ్‌లు భారీస్థాయిలో సాగుతున్నాయి. ఒక్కొక్కరు రూ.కోటిదాకా కూడా పందేలు కాచినట్లు సమాచారం.

ఎక్కడికెళ్లినా చర్చోపచర్చలు..



మారుమూల గ్రామాల్లో సైతం ఏ టీకొట్టుకెళ్లినా.. ఎక్కడికెళ్లినా అభ్యర్థుల గెలుపోటములపై చర్చోపచర్చలు సాగుతున్నాయి. ఫలానా గ్రామంలో.. ఫలానా పట్టణంలో ఆ పార్టీకి ఓట్లు ఎక్కువ వచ్చాయి, మరో పార్టీకి ఎక్కువగా పడ్డాయంటూ లెక్కలేసుకుంటున్నారు. ఇందులో ఒకరి అభిప్రాయంతో వేరొకరు అంగీకరించని పరిస్థితులు తలెత్తుతున్నాయి.

మునిగేదెవరో..?



ఇవే బెట్టింగ్‌లకు దారితీస్తున్నాయి. అభ్యర్థుల గెలుపోటములపై బెట్టింగ్‌లు కడుతున్నారు. ఎన్నికల కౌంటింగ్ తరువాత ఆయా అభ్యర్థుల్లో ఒకరు మాత్రమే విజయం సాధిస్తారు. అవతలివారు ఓడిపోతారు. పరాజయం పాలైన అభ్యర్థిపై బెట్టింగ్ వేసేవారు పూర్తిగా నష్టపోతారు. పలువురు అప్పులపాలవుతారు కూడా. 2019 ఎన్నికల్లో ఇదే తరహాలో బెట్టింగ్‌లు వేసి ఓడిపోయిన వారు తీవ్ర ఆర్థిక సమస్యల్లోకి కూరుకుపోయారు. మరికొందరు ఐపీ పెట్టి మరీ.. ఇతర ప్రాంతాలకు వెళ్లి తలదాచుకున్నారు. బెట్టింగ్ వేసేవారు ఒకసారి కుటుంబసభ్యుల గురించి ఆలోచిస్తే ఆ భూతానికి దూరంగా ఉండే అవకాశం ఉంటుంది.

కుటుంబాలు సర్వనాశనమే..



జోరుగా సాగుతున్న బెట్టింగ్‌లను కట్టడి చేయకపోతే కొన్ని కుటుంబాలు ఆర్థికంగా కుంగిపోయి, చిన్నాభిన్నమయ్యే పరిస్థితి లేకపోలేదు. బెట్టింగ్‌లు కాచి, జీవితాలనే సర్వనాశనం చేసుకున్న వారు కోకొల్లలు. ఇప్పటికైనా బెట్టింగ్‌లను పోలీసులు కట్టడి చేయాల్సి ఉంది. బెట్టింగ్‌రాయుళ్లను గుర్తించి, భవిష్యత్తులో తలెత్తే పరిణామాలను వివరిస్తూ కౌన్సిలింగ్ ఇస్తే.. పరిస్థితిలో మార్పు వస్తుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

వైసీపీ నాయకుల వెనకడుగు



ప్రధాన పార్టీ అభ్యర్థుల గెలుపుపై బెట్టింగుల జోరు కొనసాగుతోంది. ఈసారి పోలింగ్ శాతం విపరీతంగా పెరగడం గమనార్హం. దీంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు, నాయకులు ఎవరి లెక్కల్లో వారున్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటేనని కూటమి అభ్యర్థులు బల్లగుద్ది చెబుతున్నారు. ఈ నేపథ్యంలో వైసీపీ అభ్యర్థుల గెలుపుపై అనుమానంతో ఆ పార్టీ నాయకులు బెట్టింగ్‌లకు వెనకడుగు వేస్తున్నట్లు సమాచారం.





వైసీపీలో తిరుగుబాట్లు..



పోలింగ్ రోజు బూదిలిలో సవితకు మద్దతుగా నిలిచిన వైసీపీ నాయకుడు వేణుగోపాల్ రెడ్డి (కంటి అద్దాలు పెట్టుకున్న వ్యక్తి)

గోరంట్ల, మే 15: మండలంలో వైసీపీలో తిరుగుబాట్లు చేశారు. పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి ఉషశ్రీపై సొంత పార్టీ నాయకులే తిరుగుబావుటా ఎగురవేశారు. మంత్రి ఉషశ్రీ గోరంట్ల మండలంలో ఓ మాజీ సర్పంచ్ కుటుంబానికి ఎన్నికల్లో ప్రాధాన్యమిచ్చారని ఆ పార్టీలో చర్చ సాగుతోంది. దీంతో ద్వితీయశ్రేణి నాయకత్వం తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. పోలింగ్ రోజు నారసింహపల్లి పంచాయతీలోని ఓ గ్రామంలో సమావేశమై, అందులో తీసుకున్న నిర్ణయం మేరకు అంటీముట్టనట్లు వ్యవహరించినట్లు సమాచారం. బూదిలి గ్రామానికి చెందిన వైసీపీ సీనియర్ నాయకుడు, గోరంట్ల మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, ఆయన అనుచరుడు బూదిలి ఎంపీటీసీ మంజునాథ్ గౌడ్.. మంత్రి ఉషశ్రీ తీరుపై కొంతకాలంగా తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉన్న వీరు పోలింగ్ రోజు బూదిలిలో ప్రత్యక్షమై టీడీపీకి ఓటు వేయాలని ప్రజలను కోరడంతో అందరూ షాక్ అయ్యారు. దీంతో అక్కడ ఘర్షణ వాతావరణం ఏర్పడిన విషయం తెలిసిందే. పోలీసుల జోక్యంతో సద్దుమణిగింది. కూటమి అభ్యర్థి సవిత బూదిలి పోలింగ్ కేంద్రం వద్దకు రాగా.. ఆమెకు మద్దతు పలుకుతూ వేణుగోపాల్ రెడ్డి ఫొటోలు దిగారు. వాటిని వైసీపీ నాయకులకు పోస్టు చేయడంతో వారి మధ్య విభేదాలు మరింత ముదిరాయి. వెంకటరమణపల్లి పంచాయతీకి చెందిన ఓ నాయకుడు, మందపల్లిలో మరొకరు వైసీపీలో తమకు ప్రాధాన్యం ఇవ్వట్లేదంటూ టీడీపీకి సహకరించినట్లు తెలుస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో పోలింగ్ రోజు నుంచి వైసీపీ నాయకుల్లో మునుపటి ఉత్సాహం కనిపించడంలేదన్న వాదనలున్నాయి. పోలింగ్ అధికంగా నమోదవడంతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓట్లు పోలయ్యాయన్న విశ్లేషణల నేపథ్యంలో కూటమి నాయకులు ఆనందపడుతున్నారు.

ష్..!

వైసీపీలో నిశ్శబ్దం
ఒక సామాజికవర్గంపైనే ఆశలు
పంపకాలు సరిగా జరగలేదంటూ నిట్టూర్పు



హిందూపురం, మే 15: సార్వత్రిక ఎన్నికల తరువాత హిందూపురం వైసీపీలో నిశ్శబ్ద వాతావరణం నెలకొంది. మొన్నటి వరకు భారీ మెజార్టీతో గెలుస్తామని చెప్పుకున్న నాయకులు ప్రస్తుతం డీలాపడ్డారు. పోలింగ్ తరువాత ఆ పార్టీ సొంత సర్వేతోపాటు స్థానిక పరిస్థితులు, పోలింగ్ సరళిని బట్టి అధికార పార్టీలో కొంత స్తబ్దత నెలకొంది. పోలింగ్ సాగుతుండగానే ముఖ్యనేతల్లో అనుమానాలు రేకెత్తాయి. ఓటర్ల స్పందన చూసి ఆ పార్టీ కేడర్‌ను నిరుత్సాహం ఆవరించింది. పోలింగ్ ముగిశాక పూర్తిగా నైరాశ్యంలోకి జారుకున్నాయి. అధికార పార్టీ నాయకులు ఎక్కడ కలిసినా గెలుపోటములపై చర్చించుకుంటున్నారు. మొన్నటివరకు మెజార్టీపై మాట్లాడుకున్న నాయకులు నేడు గెలుపోటములపై చర్చించుకోవడం గమనార్హం.

ఒక సామాజికవర్గంపైనే ఆశలు

వైసీపీ హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి ఒక సామాజికవర్గంపైనే ఆశలు పెట్టుకున్నారు. ఆ సామాజికవర్గం నుంచి గతంలోలాగే టీడీపీకి ఓట్లు పడినట్లు నాయకులు చెబుతున్నారు. ఆ సామాజికవర్గం నుంచి అధికార పార్టీకి మెజార్టీ ఓట్లు పడ్డాయనీ, ఈసారి మరికొన్ని అదనంగా వచ్చాయని వైసీపీ నాయకులు చెప్పుకుంటున్నారు. టీడీపీకి పట్టణంలో 20వార్డులకుపైగా బలమైన ఓటు బ్యాంకు ఉంది. ఈ లెక్కన పట్టణంలో కూటమికి మెజార్టీ వస్తుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

పంపకాలపై నిట్టూర్పు

ఎన్నికల నిర్వహణ అత్యంత కీలకం. ఈసారి పురం వైసీపీలో పోల్ మేనేజ్‌మెంట్‌లో విఫలమైనట్లు ఆ పార్టీ నాయకులు చెప్పుకుంటున్నారు. పోలింగ్‌కు ముందు రోజు అధికార పార్టీ నాయకులు ఓటర్లను ప్రలోభపెట్టేందుకు డబ్బు పంపిణీ చేశారు. ఈ డబ్బును ఆయా వార్డుల ఇన్‌చార్జిలు, ప్రజాప్రతినిధులకు అందజేశారు. నిర్దేశించిన ప్రకారం అందజేయకపోవడంతో ఓటర్లు నిరాశపడ్డారు. కొంతమందికి వదిలేయడంతో ఓటర్లు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగడమే ఇందుకు నిదర్శనం. అధికార పార్టీ కౌన్సిలర్ల ఇంటి వద్ద నిరసన తెలిపారు. దీనినిబట్టి పంపకాలు ఎలా సాగాయో అర్థం చేసుకోవచ్చు. ఇది ఆ పార్టీకి పోలింగ్ రోజు పెద్ద దెబ్బకొట్టినట్లు సమాచారం.

కాకిలెక్కల్లో మరికొంతమంది నేతలు

వైసీపీలోని కొంతమంది నేతలు కాకిలెక్కల్లో నిమగ్నమయ్యారు. గతంలో ఆ పార్టీకి వచ్చిన ఓట్లు, ఈసారి సంక్షేమ పథకాల లెక్కలు వేస్తున్నారు. అధికార పార్టీలో మరికొన్ని అనుకూల అంశాలను లెక్కలు గడుతూ తమకు విజయావకాశాలున్నాయని కార్యకర్తల వద్ద చెప్పుకుంటున్నారు. అధికార పార్టీ అభ్యర్థి అనుకూలమైన అంశాలను లెక్కలు వేస్తున్నారు. ప్రతికూల అంశాలపై నోరు మెదపడం లేదు. పోలింగ్ పట్టణంకంటే పల్లెల్లో ఎక్కువగా సాగింది. గతం నుంచి టీడీపీకి హిందూపురం నియోజకవర్గంలో పట్నంతోపాటు పల్లెల్లో సైతం మెజార్టీ వస్తోంది. పల్లెల్లో బీసీ ఓటర్లు అధికంగా ఉండడమే ఇందుకు కారణం. అలాంటపుడు ఆ పార్టీకి బలమైన ఓటర్లు ఇప్పటికీ అలాగే ఉన్నారు. దీనిని బట్టి హిందూపురం నియోజకవర్గంలో ఎవరు విజయం సాధిస్తారన్నది వచ్చేనెల 4న తేలనుంది. ఏది ఏమైనా అధికార పార్టీలో నిశ్శబ్ద వాతావరణం నెలకొందనడంలో సందేహం లేదు.






వ్యవసాయాధికారులతో సమావేశమైన అవుటాల రమణారెడ్డి

విత్తన వేరుశనగ కాయలను పరిశీలిస్తూ..

ఎన్నికల కోడ్ తూచ్..

అధికారులతో జిల్లా వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ సమావేశం
విత్తన వేరుశనగ కాయల పరిశీలన

ధర్మవరం రూరల్, మే15: జిల్లా వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ అవుటాల రమణారెడ్డి ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారు. కోడ్ అమలులో ఉన్నా.. బుధవారం వ్యవసాయాధికారులతో కలిసి ధర్మవరంలోని విత్తన వేరుశనగ ప్రాసెసింగ్ యూనిట్‌ను పరిశీలించారు. ధర్మవరం ఏడీ ముస్తాఫా, బత్తలపల్లి ఏఈఓ ఉపేంద్రరెడ్డి, ఆత్మా ప్రతినిధి ప్రతిభ, ఏపీసీడ్స్ ప్రతినిధి సురేష్‌తో కలిసి విత్తన వేరుశనగ కాయలను పరిశీలించారు. అనంతరం ఆయన అధికారులతో ప్రాసెసింగ్ యూనిట్ కార్యాలయంలో విత్తనవేరుశనగ కాయల పంపిణీపై సమావేశమయ్యారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా.. ఆయనతో కలిసి అధికారులు పరిశీలించడం విమర్శలకు తావిస్తోంది. అధికారపార్టీ సేవలో తరిస్తున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి.

ఐదుగురు వైసీపీ నాయకులపై కేసు

ధర్మవరం రూరల్, మే 15: మండలంలోని ఓబుళనాయునిపల్లిలో టీడీపీ వర్గీయులపై దాడికి సంబంధించి ఐదుగురు వైసీపీ నాయకులపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. కూటమి అభ్యర్థి సత్యకుమార్ యాదవ్ తరఫున పోలింగ్ ఏజెంట్‌గా కూర్చున్నారని టీడీపీ వర్గీయులు బోగ లింగమయ్య, ఆయన కుమారుడు సింహాద్రిపై ఈనెల 14న దాడి చేసిన విషయం విదితమే. బోగ లింగమయ్య ఫిర్యాదు మేరకు వైసీపీ వర్గీయులు గడుపూటి గంగాధర్ నాయుడు, కందేరి ఆదినారాయణ, దాసరి శ్రీనివాసులు, సోమశేఖర్, అనంతరాయుడుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేంద్ర తెలిపారు.

బందోబస్తు ఏర్పాటు



ఓబుళనాయునిపల్లిలో ప్రజలతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసులు

ఓబుళనాయునిపల్లిలో డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. డీఎస్పీ గ్రామంలో పర్యటించారు. ప్రజలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. గ్రామంలో పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. దాడి చేసిన వారిపై కేసులు నమోదు చేశామనీ, చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట రూరల్ ఎస్ఐ నరేంద్ర, సిబ్బంది ఉన్నారు.

జిల్లాలో 144 సెక్షన్ కొనసాగింపు



ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తిరూరల్, మే 15: జిల్లాలో సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ పూర్తయ్యే వరకు 144 సెక్షన్ కొనసాగుతుందని ఎస్పీ మాధవరెడ్డి బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో హింసాత్మక ఘటనలకు పాల్పడినా, విద్వేషాలు రెచ్చగొట్టినా అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్‌రూంల వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టామన్నారు. సీసీ కెమెరాల పర్యవేక్షణ, పోలీసు పహారా ఉంటుందన్నారు. జిల్లాలో పోలీసు పికెట్లు, మొబైల్ పెట్రోలింగ్ పార్టీలు ఏర్పాటు చేశామని తెలిపారు. గ్రామాల్లో గొడవలకు దిగకుండా సభల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు.

టీసీసీ సర్టిఫికెట్లు వచ్చేశాయ్..

కొత్తచెరువు, మే 15: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (టీసీసీ) లోయర్, హయ్యర్ సర్టిఫికెట్లు వచ్చేశాయని జిల్లా విద్యాశాఖాధికారి మీనాక్షి బుధవారం ప్రకటనలో తెలిపారు. గతేడాది జూలైలో పరీక్షలు రాసిన విద్యార్థులకు సంబంధించిన సర్టిఫికెట్లు వచ్చాయన్నారు. ఉత్తీర్ణులైన వారికి జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఒరిజనల్ మార్కుల జాబితాలు పంపిణీ చేస్తామన్నారు. విద్యార్థులు ఆధార్, హాల్‌టిక్కెట్ నకలు తీసుకురావాలని ఆమె సూచించారు.



వైరస్‌తో చెట్టుపైనే కుళ్లిపోయిన జామపండ్లు

జామకు వైరస్



వైరస్ తెగుళ్లతో నష్టపోయిన పంటను చూపుతున్న కౌలురైతులు

25ఎకరాల్లో దెబ్బతిన్న పంట...
కౌలు రైతులకు రూ.12లక్షల నష్టం
నగలు తాకట్టుపెట్టి పంట సాగు..



రొద్దం, మే 15: పాపం.. అన్నదాత. రూ.లక్షలు పెట్టుబడులు, ఆరుగాలం శ్రమ అన్నీ బూడిదలో పోసిన పన్నీరయ్యాయి. పంట కుళ్లిపోయింది. లక్షల రూపాయల నష్టం మిగిల్చింది. రొద్దంలోని చెరుకూరు రోడ్డులోగల తోటలో 25ఎకరాల్లో కౌలురైతులు హరిప్రసాద్, యశోద జామ తోటను సాగు చేశారు. వైరస్ సోకి నిండా మునిగారు. తలుపుల మండలం ఇందుకూరుపల్లికి చెందిన కౌలు రైతులు హరిప్రసాద్, యశోద రొద్దంలో జామతోటను తీసుకుని, సాగుచేశారు. జామతోట కటింగ్ చేసి మందులు పిచికారీకి నెల చేయగా.. ఆలస్యంగా దిగుబడి వచ్చింది. నెల రోజుల నుంచి జామతోటలో పళ్లకు వైరస్ తెగుళ్ల మొత్తం ఎండుముఖం పట్టాయి. బీహార్‌కు చెందిన వ్యవసాయతోటలో పనిచేసే ముబారక్ నుంచి కౌలుకు రూ.6.20లక్షలు చెల్లించి ఆరు నెలల వ్యవధికి అగ్రిమెంట్ చేసుకున్నారు. మూడేళ్లుగా ఆ తోటకు వైరస్ సోకి చివరిదశలో పంట దిగుబడిరాక నష్టపోతున్నారు. కౌలు రైతులకు ఆ విషయం తెలియక తోటలో పనిచేసే వ్యక్తులతో కౌలుకుతీసుకుని మోసపోయినట్లు వారు వాపోయారు. బంగారం తాకట్టుపెట్టి, పెట్టుబడులు పెట్టినట్లు తెలిపారు. జామ సాగుతో రూ.12లక్షలు నష్టపోయామని బాధితుడు వాపోయాడు. రెండు లోడ్ల జామపండ్లు మాత్రమే బెంగళూరు, హైదరాబాద్‌కు తీసుకెళ్లగా.. వాహన ఖర్చులు మాత్రమే వచ్చాయన్నారు. జామపండ్లు కోసిన ఒక్క రోజు మాత్రమే బాగుంటాయనీ, వైరస్ తెగుళ్లతో మార్కెట్‌లో గిరాకీ రాక నష్టపోయామన్నారు.

వసతి అడిగితే.. తాళం వేశారు..!



ఎస్కేయూ పరిపాలనా భవనం బయట నిరసన తెలుపుతున్న విద్యార్థులు

అనంతపురం సెంట్రల్, మే 15: పోటీ పరీక్షలకు చదువుకుంటున్న ఎస్కేయూ విద్యార్థులు తమకు హాస్టల్ వసతి కల్పించాలని వర్సిటీ యాజమాన్యాన్ని అభ్యర్థించేందుకు బుధవారం పరిపాలనా భవానికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న అధికారులు విద్యార్థులను కట్టడిచేసి పరిపాలనా భవనంలోకి రాకుండా తాళాలు వేశారు. దీంతో బాధిత విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు వేమన, హేమంత్ కుమార్‌లతో కలిసి భవనం బయటే నిరసన వ్యక్తంచేశారు. వేసవి సెలవులు ప్రకటించడంతో హాస్టల్స్‌ను మూసివేశారని, పోటీ పరీక్షలకు చదువుకోవాడానికి సమస్యగా మారిందని వాపోయారు. భోజన సదుపాయం అవసరంలేదని కేవలం వసతిని మాత్రమే కల్పించాలని అధికారులకు విజ్ఞప్తి చేసేందుకు వస్తే ఇలా తాళాలు వేసుకోవడం ఏంటని ప్రశ్నించారు. పోలీసులను పిలిపించి అడ్డుకోవడం హేయమైన చర్య అని మండిపడ్డారు. తాము పోటీ పరీక్షలకు చదువుకునేలా వసతిని కల్పించాలని డిమాండ్‌చేశారు.

ఎస్‌ఎల్‌ఏపీలో భారీ అగ్నిప్రమాదం

● పెద్దఎత్తున ఆస్తి నష్టం.. పలువురికి అస్వస్థత



పరిశ్రమలో ఎగిసి పడుతున్న మంటలు

పెనుకొండ టౌన్, మే 15: సోమందేపల్లి మండలం గుడిపల్లి పంచాయతీ పరిధిలో ఇండస్ట్రియల్ ఏరియాలో ఉన్న ఎస్‌ఎల్‌ఏపీ పరిశ్రమలో బుధవారం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. కియ కార్లకు విడిభాగాలు అందించే అనుబంధ పరిశ్రమలో ఎస్‌ఎల్‌ఏపీ ఒకటి. ఇక్కడ కార్లకు సంబంధించి ఏసీ, గ్లాసులు తయారు చేస్తారు. పరిశ్రమను మరింత అభివృద్ధి చేసేందుకు నిర్మాణ పనులు చేపట్టారు. దుమ్ము దూళి రాకుండా పట్టలు కప్పారు. సిబ్బంది వెల్డింగ్ పనులు చేస్తుండగా షార్ట్‌సర్క్యూట్ జరిగి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఫైర్ సేఫ్టీ పరికరాలతో ప్రయత్నించినా మంటలు అదుపులోకి రాలేదు. పెనుకొండ, హిందూపురం నుంచి ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. అప్పటికే భారీగా నష్టం జరిగింది. ముడి సరుకులు దగ్ధం కావడంతో రూ.కోట్లలో నష్టం జరిగిందని సమాచారం. పలువురు కార్మికులు అస్వస్థతకు గురయ్యారు. సోమందేపల్లి ఎస్‌ఐ విజయ్‌కుమార్, ఫైర్ సిబ్బంది ఈ ప్రమాద వివరాలను సేకరిస్తున్నారు. పెద్దఎత్తున మంటలు ఎగిసిపడటంతో చుట్టుపక్కల ఉన్న పరిశ్రమలవారు భయాందోళనకు గురయ్యారు.



అస్వస్థతకు గురైన కార్మికుడు

హత్యకేసులో ముద్దాయిలకు జీవితఖైదు

ముదిగుబ్బ, మే 15: ఓ హత్యకేసులో ముద్దాయిలకు జీవితఖైదు విధించినట్లు ముదిగుబ్బ సీఐ యతీంద్ర తెలిపారు. ముదిగుబ్బ మండలం ఎస్.బండ్లపల్లి గ్రామానికి చెందిన సాకే గంగరాజు, తలుపుల మండలం సబ్బనగుంతపల్లి గ్రామానికి చెందిన గుజ్జల గంగప్ప భార్యతో వివాహేతర సంబంధం కలిగి ఉన్నాడనే అనుమానంతో సాకే గంగరాజును ఎలాగైనా హత్య చేయాలని గంగప్ప, అతని స్నేహితుడు సానేవారిపల్లి గ్రామానికి చెందిన లోమడ ఆంజనేయులు పథకం పన్నారు. వారంతా కలిసి 2016 మార్చి 2న ఉదయం 7:45 గంటల సమయంలో సాకే గంగరాజును మేకలు కొనడానికి ముదిగుబ్బ పాతవూరికి వెళ్దామని నమ్మించారు. ఇద్దరు ద్విచక్ర వాహనంలో కూర్చోబెట్టుకొని, పాతూరు రైల్వేగేటుకు దగ్గరలో ఉన్న మిల్లు వెనుకకు వెళ్లారు. అక్కడికి వెళ్లగానే ఒక్కసారిగా వారి వెంట తెచ్చుకున్న కొడవళ్లతో విచక్షణారహితంగా సాకే గంగరాజు తలపై నరికి చంపి పారిపోయారన్నారు. గంగరాజు అన్న సాకే వెంగముని ఫిర్యాదు చేయగా అప్పటి నల్లమాడ సీఐ శివరాముడు, ఎస్‌ఐ జయనాయక్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టి ముద్దాయిలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారన్నారు. కోర్టులో చార్జ్‌షీట్ ఫైల్ చేయగా అనంతపురము నాల్గవ జిల్లా సెషన్స్ కోర్టు న్యాయాధికారి విచారించి, వాదనలు ముగిసిన అనంతరం ముద్దాయిలు గుజ్జల గంగప్ప, లోమడ ఆంజనేయులుకు ఒక్కొక్కరికి 5వేలు జరిమానా విధించడంతో పాటు జీవితఖైదు శిక్ష విధిస్తూ బుధవారం తీర్పు వెలువరించినట్లు సీఐ తెలిపారు. హత్యకేసులో ముద్దాయిలకు శిక్ష పడే విధంగా కేసు దర్యాప్తు చేపట్టిన అప్పటి అధికారులను శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ మాధవరెడ్డి అభినందించినట్లు తెలిపారు.

భవితను తేల్చేది యువతేనా..?



● వైసీపీ అభ్యర్థుల అంతర్మథనం
● కూటమి పథకాలపై ఆందోళన
● జగన్ నియంతృత్వ పాలనపైనా విసుర్లు
● అధికార పార్టీలో నైరాశ్యం

అనంతపురం, మే 15(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సరళి అధికార వైసీపీ అభ్యర్థులకు కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. పోలింగ్‌కు ముందురోజు వరకూ మళ్లీ మేమే అధికారంలోకి వస్తామనే ఆశల పల్లకిలో ఆ పార్టీ అభ్యర్థులు ఉన్నారు. పోలింగ్ ముగిసిన తరువాత గెలుపోటములపై ఆ పార్టీ అభ్యర్థుల్లో అనేక అనుమానాలు నెలకొన్నాయి. ఐదేళ్ల పాలనలో బటన్ నొక్కుడుతో ప్రతి ఇంటికి లబ్ధి చేకూర్చామని గొప్పలుపోయిన ఆ పార్టీ అభ్యర్థులు... అభివృద్ధిని మరిచాం కదా అని ఇప్పుడు గుర్తిస్తున్నారు. పింఛన్‌దారులు, మహిళలు తమకే ఓటు వేసుంటారనే నమ్మకంతో ఉన్న వైసీపీ అభ్యర్థులకు యువ ఓటర్ల నిర్ణయంపై గుబులు రేపుతోంది. యువత ఎటువైపు ఉన్నారనే అంతర్మథనంలో వైసీపీ అభ్యర్థులు కొట్టుమిట్టాడుతున్నారు. ఆయా ని యోజకవర్గాల్లో పోలైన ఓట్లల్లో యువత ఓట్ల శాతం ఎంత ఉంటుందనే లెక్క లు వేసుకుంటున్నారు. ఐదేళ్ల పాలనలో యువతకు ప్రత్యేకంగా ప్రయోజనా లు చేకూర్చింది లేదు కదా అనే భావన ఆ పార్టీ శ్రేణుల్లోనే వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో యువత ఓటు ఎటువైపు అనే సందిగ్ధం వారిని వెంటాడుతోం ది. చివరికి గెలుపోటములపై.. ఎలా రాసి పెట్టి ఉంటే అలా జరుగుతుందనే నైరాశ్యంలో ఆ పార్టీ అభ్యర్థులు ఉన్నారన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

కూటమి యువత పథకాలపై ఆందోళన

సూపర్‌సిక్స్ పథకాల్లో భాగంగా... యువతకు ఏడాదికి 4 లక్షలు చొప్పున ఐదేళ్లకు 20 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని కూటమి మేనిఫెస్టోలో స్పష్టం చేసిన విషయం తెలిసిందే. ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ విడుదల చేయడంతో పాటు... యువతకు ఉద్యోగం వచ్చేంత వరకూ నెలకు రూ. 3 వేలు నిరుద్యోగ భృతి అందజేస్తామని టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఎన్నికల ప్రచారంలో ప్రతి సభలోనూ స్పష్టం చేశారు. రాష్ట్రం విడిపోయిన తరువాత విభజిత రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు బాధ్యతలు చేపట్టిన తరువాత కరువు జిల్లాలో కియా పరిశ్రమ తీసుకొచ్చి వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించిన విషయం తెలిసిందే. మరీ ముఖ్యంగా కూటమి అధికారంలోకి రాగానే... మెగా డీఎస్సీపైనే తొలి సంతకం చేస్తానని చంద్రబాబు స్పష్టమైన హామీ ఇవ్వడంతో యువతలో ఆశలు చిగురించాయి. ఈ నేపథ్యంలోనే... బెంగళూరు, హైదరాబాదు, చెన్నై నగరాల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తున్న యువత పెద్దఎత్తున ఓటింగ్‌లో పాల్గొనడం వైసీపీ అభ్యర్థుల్లో ఆందోళన కలిగిస్తోంది. తమ గెలుపోటములపై యువత ప్రభావం తప్పనిసరిగా పడుతుందన్న అభద్రతాభావం వైసీపీ అభ్యర్థులను వెంటాడుతోంది.

అధినేత నియంతృత్వ పాలనపైనా విసుర్లు

రాజశేఖర్‌రెడ్డి బిడ్డగా... ఆయనకంటే మెరుగైన పాలన అందిస్తానని ఒక్క చాన్స్ ఇవ్వాలని వైఎస్ జగన్ పాదయాత్రలోనూ, గత సార్వత్రిక ఎన్నికల ప్రచారంలోనూ ప్రజలను అభ్యర్థించారు. అన్ని వర్గాల ప్రజలు జగన్ మాటలు నమ్మి తిరుగులేని మెజార్టీతో అధికారాన్ని కట్టబెట్టారు. ప్రజల సంక్షేమంతో పాటు అభివృద్ధిని సమపాళ్లల్లో చూడాల్సిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌రెడ్డి నియంతృత్వ పాలన సాగించాడని పోలింగ్ తరువాత ఆ పార్టీ అభ్యర్థుల్లో విసుర్లు మొదలయ్యాయి. ఎన్టీ రామారావు కాలం నుంచే పింఛన్లు, సంక్షేమ పథకాలు అందిస్తున్నారు. ఆ సంక్షేమ పథకాలే గెలిపిస్తాయనుకుంటే పొరబడినట్లేనన్న భావన ఆ పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతోంది. మేనిఫెస్టో రూపకల్పనలోనూ కూటమి మేనిఫెస్టోతో పోలిస్తే... వైసీపీ మేనిఫెస్టో ప్రజల్లో భరోసా నింపలేదన్న వాదన ఆ పార్టీలో లేకపోలేదు. సంక్షేమ పథకాల ద్వారా ఫలానా ఇంటికి ఇంతమొత్తంలో లబ్ధి చేకూర్చామని ఇంటింటికి వెళ్లి చెబుతున్నామే గానీ.. యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు పరిశ్రమలు తీసుకొచ్చారా..? ఒక్క ఉద్యోగం అయినా ఇచ్చారా..? ప్రాజెక్టులు పూర్తీచేసి ఒక ఎకరాకైనా సాగు నీరిచ్చారా..? అనే ప్రశ్నలకు ఆ పార్టీ అభ్యర్థులు సమాధానం ఇచ్చుకోలేని పరిస్థితిని ఎదుర్కొన్నామన్న ఆవేదన వారిలో ఉంది. ఈ పరిణామాలే తమను దెబ్బ తీస్తాయని ఆ పార్టీ అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు.

యువత ఓటు శాతంపై గుబులు

యువత ఓటు శాతం పెరగడంపై అధికార వైసీపీ అభ్యర్థుల్లో అలజడి రేపుతోంది. జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాల్లో యువ ఓటర్లు అత్యధికంగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఏ పోలింగ్ కేంద్రంలో చూసినా... ఉదయం 7 గంటలకు ముందే యువత ఓటు వేసేందుకు బారులు తీరిన విషయం తెలిసిందే. ఇదే అధికార వైసీపీ అభ్యర్థుల్లో గుబులు రాజేస్తోంది. జిల్లా వ్యాప్తంగా 20.18 లక్షల మంది ఓటర్లుండగా... అందులో 18 ఏళ్ల నుంచి 19 ఏళ్ల వయస్సు యువ ఓటర్లు 49,234 మంది ఉన్నారు. 20 నుంచి 29 ఏళ్ల లోపు యువకులు 3,72,769 మంది ఉన్నారు. 30 నుంచి 39 ఏళ్లలోపు యువకులు 5,84,111 మంది ఉన్నారు. అంటే మొత్తంగా యువ ఓటర్లు 10,06,114 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. అంటే జిల్లా ఓటర్లల్లో 50 శాతం మంది యువ ఓటర్లు ఉన్నారు. జిల్లాలో పెద్ద ఎత్తున పోలింగ్ నమోదు కావడంతో... యువ ఓటర్లు దాదాపు 37 శాతం మంది ఓటు హక్కు వినియోగించుకున్నట్లు పోలింగ్ విధులకు హాజరైన ఉద్యోగ వర్గాల ద్వారా అందిన సమాచారం. ఈ యువ ఓటింగ్ శాతమే వైసీపీ అభ్యర్థుల్లో గుబులు రాజేస్తోంది. ప్రతి నియోజకవర్గంలోనూ 25 వేల నుంచి 35 వేల మందికిపైగానే యువ ఓటర్లు ఉండటం వైసీపీ అభ్యర్థులకు కంటకంగా మారిందనడంలో ఎలాంటి సందేహం లేదు.

రక్షించాల్సిన పోలీసులే దాడులు చేస్తారా..?

● డీఎస్పీ చైతన్య ఆదేశాలతోనే కార్యకర్తలపై దాడి
● టీడీపీ శ్రేణులపై ఏకపక్ష చర్యలు
● ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలి
● కూటమి ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం అర్బన్, మే 15: ప్రజలను రక్షించాల్సిన పోలీసులే శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా టీడీపీ శ్రేణులపై దాడులు చేయడం సరికాదని కూటమి ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసుల దాడిలో తీవ్రంగా గాయపడి అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న దాసరి కిరణ్, వైసీపీ నాయకుల దాడిలో గాయపడిన పుట్లూరు మండలానికి చెందిన లోకనాథ్ చౌదరి, రామ్మోహన్‌లను బుధవారం ఆయన పరామర్శించారు. దాడులు జరిగిన తీరును బాధితులను అడిగి తెలుసుకున్నారు. జేసీ ప్రభాకర్‌రెడ్డి కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న దాసరి కిరణ్‌ను మంగళవారం అర్ధరాత్రి సమయంలో పోలీసులు ఇంటి నుంచి బలవంతంగా డీఎస్పీ చైతన్య వద్దకు తీసుకువెళ్లారన్నారు. డీఎస్పీ ఆదేశాలతో పోలీసులు దాసరి కిరణ్‌పై విచక్షణా రహితంగా దాడి చేశారన్నారు. పోలింగ్ రోజు టీడీపీ తరఫున ఏజెంట్లుగా కూర్చున్న టీడీపీ నాయకులను టార్గెట్ చేసుకొని డీఎస్పీ ఏకపక్షంగా వ్యవహరిస్తూ భయభ్రాంతులకు గురిచేయడం దుర్మార్గమన్నారు. టీడీపీ నాయకుడు సూర్యముని, టీడీపీ శ్రేణులపై దాడులకు పాల్పడిన వైసీపీ గూండాలను వదిలేసి దాడులకు ఎలాంటి సంబంధం లేని వారిపై పోలీసులు అక్రమ అరెస్టులు చేసేందుకు కుట్రలు చేయడం దారుణమన్నారు. ఓటమిని అంగీకరించలేకనే టీడీపీ నాయకులు, కార్యకర్తలపై ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ గూండాలు దాడులకు తెగబడుతున్నారు. ఎన్నికల కమిషన్ ఈ ఘటనలపై స్పందించి, ఏకపక్షంగా వ్యవహరిస్తున్న డీఎస్పీ, పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



పోలీసుల దాడిలో తీవ్రంగా గాయపడిన దాసరి కిరణ్‌ను పరామర్శిస్తున్న అంబికా లక్ష్మీనారాయణ

ఓటమి భయంతోనే దాడులు

హిందూపురం: ఎన్నికల్లో ఓడిపోతామని తెలిసే వైసీపీ నాయకులు దాడులకు తెగబడుతున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజనప్ప అన్నారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడతూ.... తాడిపత్రితో పాటు మాచర్ల, తిరుపతి తదితర ప్రాంతాల్లో పోలింగ్ ముగిసినా వైసీపీ నాయకులు దాడులు చేస్తున్నారంటే వారిలో ఓటమి భయం పట్టుకుందన్నారు. ముఖ్యంగా తాడిపత్రిలో వైసీపీ ఆగడాలు శ్రుతిమించాయన్నారు. వైసీపీ గూండాలపై పోలీసులు గట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తమిళనాడువాసి హత్య

హిందూపురం, మే 15: తమిళనాడు రాష్ట్రంలోని సేలంకు చెందిన సెల్వకుమార్(54) అనే వ్యక్తిని గుర్తు తెలియని వ్యక్తులు బండరాళ్లతో మోది హత్య చేశారు. హిందూపురం సమీపంలోని మోతకపల్లి వద్ద మంగళవారం రాత్రి ఈ హత్య జరిగిందని వన్‌టౌన్ సీఐ శ్రీనివాసులు తెలిపారు. సేలంకు చెందిన సెల్వకుమార్ సోదరులు కర్ణాటక రాష్ట్రంలోని దొడ్డబళ్లాపురంలో ఉంటున్నారు. సెల్వకుమార్‌కు మతిస్థిమితం లేదు. దీంతో పరిగి మండలం మోదా సమీపంలోని ఓ ఆశ్రమంలో చేర్పించారు. అతను హిందూపురానికి మంగళవారం వ చ్చాడు. మోతుకపల్లి సమీపంలో హత్యకు గురయ్యాడు. ఆ దారిలో బుధవారం ఉదయం వెళ్లేవారు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు పరిశీలించి, ఆధారాలు సేకరించారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. సెల్వకుమార్ సోదరుడు సంఘటనా స్థలాన్ని చేరుకుని మృతదేహాన్ని గుర్తించాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

34 మందిపై కేసు నమోదు

యాడికి, మే 15: పోలింగ్ రోజున జరిగిన గొడవల నేపథ్యంలో మండల పరిధిలోని కోనుప్పలపాడుకు చెందిన వైసీపీ, టీడీపీకి చెందిన 34 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 13న టీడీపీ వైసీపీ వర్గీయులు గ్రామంలో రాళ్లు రువ్వుకున్నారు. ఇరువర్గాలకు చెందిన పలువురు గాయపడ్డారు. టీడీపీకి చెందిన రామాంజనేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎనిమిది మంది వైసీపీ వర్గీయులపై కేసు నమోదు చేశారు. నిందితుల్లో బాలగంగయ్య, గంగిరెడ్డి, బాలగంగన్న తదితరులు ఉన్నారు. వైసీపీ నాయకుడు బాలగంగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు 26 మంది టీడీపీ వారిపై కేసు నమోదు చేశారు. నిందితుల్లో చవ్వా గోపాల్‌రెడ్డి, రామాంజనేయులు, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

తినేశారా..?

● బీఎల్‌ఓలకు డబ్బు ఎగ్గొట్టిన అధికారులు



గుంతకల్లు, మే 15: పట్టణంలోని బీఎల్‌ఓ(బూత్ లెవెల్ అధికారులు)లకు ఖర్చుల కింద ఇవ్వాల్సిన డబ్బు ఇవ్వకుండా ఎన్నికల అధికారులు శఠగోపం పెట్టారు. పోలింగ్ రోజు ఖర్చుల కోసం నియోజకవర్గంలోని 276 పోలింగ్ బూత్ సిబ్బందికి టీ, బిస్కెట్స్, స్నాక్స్ కోసం బీఎల్‌ఓలకు ఒక్కొక్కరికి రూ.వెయ్యి ఇవ్వాల్సి ఉంది. గత వారంలో ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణా కార్యక్రమం చివరి రోజున ఈ డబ్బు బీఎల్‌ఓలకు ఇవ్వాల్సి ఉంది. అయితే గుంతకల్లు మండలం, గుత్తి, పామిడి మండలాల బీఎల్వోల నుంచి ఓచరు సిగ్నేచరు తీసుకుని సంబంధిత డబ్బును అందజేశారు. కానీ గుంతకల్లు అర్బన్ ఏరియాకు సంబంధించి 106 మంది బీఎల్వోల నుంచి ముందుగానే ఓచరు సంతకాలు తీసుకుని, మీటింగ్ తర్వాత డబ్బివ్వకుండా పంపివేశారు. కొందరు బీఎల్వోలు ఎన్నికల అధికారులను రూ. వెయ్యికి సంబంధించి ప్రశ్నించగా, మొదట మీరు ఖర్చు చేయండి, ఆ తర్వాత బిల్లు దాఖలు చేయండి, డబ్బులిస్తామంటూ మాటదాటవేశారని తెలిసింది. ఈ మేరకు దాదాపు బీఎల్వోలకు పంపిణీ చేయాల్సిన డబ్బు రూ. లక్ష మేరకు ఇవ్వకుండా చుక్కలు చూపుతున్నారు. గుంతకల్లులో ఎన్నికల సిబ్బందికి మున్సిపల్ అధికారులు అధ్వానమైన భోజనాన్ని అందజేశారని పేరు చెప్పడానికి ఇష్టపడని ఓ పోలింగ్ సిబ్బంది పేర్కొన్నారు. ఆ అన్నాన్ని తింటే ఎన్నికల వేళ కడుపునొప్పి వచ్చి ఎక్కడ పోలింగ్ కార్యక్రమానికి అంతరాయం ఏర్పడుతుందోనన్న భయంతో భోజనం తినకుండా కేవలం అరటిపండుతో సరిపుచ్చుకోవాల్సి వచ్చిందని ఆ వ్యక్తి బాధను వెల్లబోసుకున్నారు.

ట్రిపుల్ ఐటీకి దరఖాస్తుల ఆహ్వానం

కొత్తచెరువు, మే 15: రాష్ట్రంలో పదో తరగతి పాసైన విద్యార్థులు ఇడుపులపాయ, నూజివీడు, శ్రీకాకుళం, ఒంగోలులో ఉన్న ట్రిపుల్ ఐటీలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి మీనాక్షి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి 6న నోటిఫికేషన్ వెలువడిందని, బీటెక్ ఆరేళ్ల సమీకృత ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశం కోసం ఒక్కో కాలేజీలో 1000 సీట్లు ఉంటాయన్నారు. ఈడబ్ల్యూఎస్ కోటాలో మరో 100 సీట్లు ఉంటాయని, ఈ కోర్సుల్లో చేరేందుకు దరఖాస్తులను ఈనెల 8 నుంచి జూలై 25వ తేదీ సాయంత్రం 5గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ప్రవేశాల్లో ఎస్సీలకు 15శాతం, ఎస్టీలకు 6శాతం, బీసీ-ఏకు 7శాతం, బీసీ-బీకి 10శాతం, బీసీ-సీకి 1శాతం, బీసీ-డీకి 7శాతం, బీసీ-ఈకి 4శాతం చొప్పున రిజర్వేషన్లు ఉంటాయన్నారు. దివ్యాంగులకు ప్రత్యేకంగా 5శాతం, సైనిక ఉద్యోగ పిల్లలకు 2 శాతం, ఎన్‌సీసీ విద్యార్థులకు 1 శాతం, స్పోర్ట్స్ కోటా కింద 0.5 శాతం, భారత్ స్కాట్స్ అండ్ గైడ్స్ కోటా కింద 0.5శాతం సీట్లు భర్తీ చేస్తారన్నారు. ప్రతి కేటగిరిలోనూ 33.33 శాతం సీట్లు సమాంతరంగా బాలికలకు కేటాయిస్తారన్నారు.

మెరిట్ ఆధారంగా అడ్మిషన్లు ఇలా..: పదో తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా మెరిట్ పద్ధతిలో ట్రిపుల్ ఐటీలో ప్రవేశాలు కల్పిస్తారు. నాన్ రెసిడెన్షియల్ ప్రభుత్వ పాఠశాలలు, జిల్లా పరిషత్ హైస్కూల్‌లో, మున్సిపల్ హైస్కూల్‌లో చదివిన విద్యార్థులకు వచ్చిన మార్కులకు 4 శాతం, డిప్రివేషన్ స్కోరును అదనంగా కలుపుతారని దీనిని సాంఘికంగా, ఆర్థికంగా వెనుకబాటుకు గురైన విద్యార్థులకు ఇచ్చే వేయిటేజీ మార్కులన్నారు. 85శాతం సీట్లను స్థానికంగానే మిగిలిన 15 శాతం సీట్లను మెరిట్ కోటాలో తెలుగురాష్ట్రాల్లోని విద్యార్థులకు కేటాయిస్తారు. విద్యార్థులు తొలిప్రయత్నంలోనే 10వ తరగతి లేదా తత్సమాన పరీక్షలలో రెగ్యులర్ విద్యార్థులుగా ఉత్తీర్ణులైనవారు అర్హులు. వయస్సు 31-12-2024 నాటికి 18 ఏళ్లు నిండకుండా ఉండాలి. ఎస్సీ, ఎస్టీ కేటగిరి అభ్యర్థులకైతే 21 ఏళ్లు నిండకుండా ఉన్నవారు అర్హులు.

ఎస్కేయూ ప్రొఫెసర్‌కు రాష్ట్రస్థాయి బహుమతి



జీవీ రమణ

అనంతపురం సెంట్రల్, మే 15: ఎస్కేయూ సామాజిక శాస్త్ర విభాగం ప్రొఫెసర్, కవి, రచయిత, మోటివేషనల్ స్పీకర్ జీవీ రమణ రచించిన కవితలకు ఉమ్మడి రాష్ట్రస్థాయి బహుమతి లభించింది. సాయుధ తెలంగాణ పోరాట యోధులు కర్కముత్తారెడ్డి స్మారకార్థం వసుంధర విజ్ఞాన మండలి మార్చిలో ఉమ్మడి రాష్ట్రస్థాయి కవితల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో రమణ రచించిన 'మత సామరస్యం-మన భారత దేశం' అనే కవిత ఉత్తమ బహుమతికి ఎంపికైంది. హైదరాబద్‌లో త్వరలో నిర్వహించే వసుంధర విజ్ఞాన మండలి 31వ వార్షికోత్సవాల్లో ఈ బహుమతిని అందుకోనున్నట్లు రమణ తెలిపారు.

మీరా.. మేమా..!

జడ్పీలో సభ్యులు.. అధికారుల మధ్య కోల్డ్‌వార్





సమావేశాల నిర్వహణ పట్టని ఉన్నతాధికారులు
90 రోజుల గడువు ముగిసినా స్పందన కరువు
జడ్పీ చైర్‌పర్సన్ క్యాంప్ క్లర్క్‌ల ఉపసంహరణ
సమావేశంపై చైర్‌పర్సన్‌తో చర్చించని సీఈఓ, డిప్యూటీ
ప్రజా సమస్యలకంటే పట్టింపులు.. పంతాలే ముఖ్యమా..?
అధికారులు, పాలకవర్గం తీరుపై సర్వత్రా విమర్శలు

అనంతపురం విద్య, మే 15: ప్రజలు ఎటుపోతే మనకేంటి..? సమావేశాలు మనకెందుకు..? ప్రజా సమస్యలపై చర్చలు ఎందుకు..? ఇదీ.. ఉమ్మడి జిల్లా పరిషత్ తీరు. ఉన్నతాధికారులు, పాలకవర్గ సభ్యులు పంతానికి పోతున్నారు. ఆ రెండు వర్గాల మధ్య కోల్డ్ వార్ తారస్థాయికి చేరింది. అధికారులు పాలకవర్గాన్ని దిక్కరిస్తున్నారంటూ గతంలో జడ్పీటీలు రోడ్డుపైకి వచ్చారు. సమావేశాలను బహిష్కరించారు. డిప్యూటీ సీఈఓను సరెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అదే గొడవ చాప కింద నీరులా సాగుతూనే ఉంది. జడ్పీలో సమావేశాల నిర్వహణను అధికారులు గాలికి వదిలేశారు. 'మాకు ఇష్టమైతే నిర్వహిస్తాం.. లేదంటే లేదు..' అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ప్రతి 90 రోజుల వ్యవధిలో జడ్పీ సర్వసభ్య సమావేశాలను నిర్వహించాల్సి ఉంటుంది. కానీ ఈ నిబంధలను అధికారులు పూర్తిగా పక్కన పెట్టేశారు. జనవరి 17న జడ్పీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆ తరువాత 90 రోజుల్లో నిర్వహించాల్సి ఉన్నా కుంటి సాకులతో కాలయాపన చేస్తున్నారు. నిబంధనల ప్రకారం 90 రోజులు కాదని, 90 పని దినాలు (వర్కింగ్ డేస్) అని అధికారులు కొత్త భాష్యం చెప్పుకుంటున్నారు. వారు చెప్పిన ఆ గడువు కూడా ఈ నెల 9వ తేదీ ముగిసింది. ఇప్పటి వరకూ పట్టించుకోలేదు. సమావేశం నిర్వహించాలనే అంశంపై కూడా పెద్ద రాద్ధాంతం జరుగుతోందని సమాచారం. జడ్పీ సీఈఓ, డిప్యూటీ సీఈఓ పాలకవర్గాన్ని ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి.

ఇదీ తీరు..

జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు సంబంధించినది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రజలకు సంబంధించిన అనేక సమస్యలపై, అంశాలపై చర్చించాల్సి ఉంటుంది. పాలకవర్గ సభ్యులు, అధికారులు ప్రజా సమస్యలకు పరిష్కారాలను అన్వేషించాల్సి ఉంటుంది. అందుకే సమావేశం అత్యంత కీలకమైనది. అయితే సమావేశం నిర్వహణ చుట్టూ వివాదం నడుస్తోంది. జనవరి 17వ తేదీ సమావేశం నిర్వహించారు. నిబంధనల మేరకు తొంభై రోజులు సమీపించగానే అధికారులు పాలకవర్గంతో చర్చించి, సమావేశం పెట్టాలి. పాత పద్ధతి ప్రకారం ఏప్రిల్ 17, అధికారుల లెక్క ప్రకారం ఈ నెల 9న.. ఏదో ఒక తేదీలోగా సమావేశం నిర్వహించాలి. కానీ పట్టించుకోలేదు. ఈ నెల 9వ తేదీకి ముందు జడ్పీ అధికారులు సర్వసభ్య సమావేశం నిర్వహణ తేదీపై జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మకు నోట్ పట్టారని సమాచారం. దీంతో ఆమె దీనిపై చర్చించేందుకు సీఈఓ రావాలని ఫైల్‌పై డిస్కస్ అని రాసినట్లు తెలుస్తోంది. అయితే సీఈఓ చైర్‌పర్సన్ వద్దకు వెళ్లలేదని సమాచారం. సీఈఓ అందుబాటులో లేకుంటే.. డిప్యూటీ సీఈఓ వెళ్లాలి. అయితే డిప్యూటీ సీఈఓ కూడా వెళ్లలేదని సమాచారం.



జడ్పీ చైర్‌పర్సన్ సీసీలను వెనక్కు రప్పిస్తూ...ఇచ్చిన ఉత్తర్వుల కాపీ

ముగ్గురు సీసీలు వెనక్కు..

సర్వసభ్య సమావేశం గురించి చర్చించడానికి చైర్ పర్సన్ వద్దకు జడ్పీ ఉన్నతాధికారులు వెళ్లకపోగా, కింది స్థాయి సిబ్బందిని బలితీసుకుంటున్నట్లు కనిపిస్తోంది. జడ్పీ చైర్‌పర్సన్‌ను సమావేశానికి ఎందుకు ఒప్పించలేదని ముగ్గురు క్యాంప్ క్లర్కులపై(సీసీ) సీఈఓ, డిప్యూటీ సీఈఓ ఫైర్ అయ్యారని సమాచారం. చైర్‌పర్సన్ క్యాంపు ఆఫీస్‌లో సీసీలుగా పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ స్థాయి అధికారులు.. సురేష్‌కుమార్, నరేష్ కుమార్, అనిల్ కుమార్ (సెలవులో ఉన్నారు) సర్వీసును విత్‌డ్రా చేశారు. ఈ మేరకు సీఈఓ ఈ నెల 8వ తేదీ ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల కోడ్ నెపంతో వాళ్లను క్యాంపు ఆఫీస్ నుంచి వెనక్కు తీసుకున్నారు. కానీ అధికారులు, పాలకవర్గం మధ్య కోల్డ్‌వార్ కారణంగానే వారిని వెనక్కు తీసుకున్నట్లు జడ్పీలో చర్చ సాగుతోంది. ఎన్నికల కోడ్ కారణంగానే సీసీలను వెనక్కు రప్పించాలని అనుకుని ఉంటే.. కోడ్ అమల్లోకి వచ్చిన వెంటనే రప్పించేవారని, కానీ ఉన్నఫలంగా ఇప్పుడు రప్పించడం ఏమటని ప్రశ్నిస్తున్నారు.



చట్టానికి తూట్లు..

పంచాయతీరాజ్ చట్టం మేరకు ప్రతి 90 రోజులకు ఒకసారి జడ్పీ సర్వసభ్య సమావేశం నిర్వహించాలి. ఒక సమావేశం నిర్వహించిన తర్వాత తొంబై రోజుల గడువు ముగిసే లోగా మళ్లీ నిర్వహించాలి. పంచాయతీరాజ్ చట్టం ఇదే చెబుతోంది. అయితే జడ్పీలో అధికారులు దీన్ని ఏమాత్రం పట్టించుకోవడం లేదని స్పష్టమవుతోంది. గతంలో కూడా పంచాయతీరాజ్ చట్టం మేరకు 90 రోజుల్లో నిర్వహించాల్సిన సమావేశాన్ని 136 రోజులు దాటినా నిర్వహించలేదని జడ్పీటీసీలు అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినా అధికారుల తీరు మారడం లేదు. తాజాగా మరోసారి పంతాలకుపోయి సమావేశాలను గాలికి వదిలేశారు. గతంలో ఉన్న కలెక్టర్ ఈ సమస్యను పట్టించుకోలేదు. పైగా అధికారులు వర్సెస్ పాలకవర్గం మధ్య ఉన్న కోల్డ్ వార్‌కు ఆజ్యం పోశారన్న విమర్శలు ఎదుర్కొన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన పాలకవర్గం సభ్యులు, అధికారులు పంతాలకు, పట్టింపులకు వెళ్లడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. కొత్త కలెక్టర్ ఈ సమస్యకు చెక్ పడుతారో లేదో వేచి చూడాల్సిందే.



పోటాపోటీగా.. పోలింగ్

- పురుషులు, మహిళలు భారీగా ఓటు హక్కు వినియోగం
- పుట్టపర్తిలో 2,11,062 మంది ఓటర్లు
- ఓటు వేసిన వారు 18,20,93 మంది
- 84.27 శాతం నమోదైన పోలింగ్


వెంగళమ్మచెరువులో ఓటు వేసేందుకు బారులుతీరిన మహిళా ఓటర్లు (ఫైల్)

పుట్టపర్తిరూరల్ మే 15: పుట్టపర్తి నియోజకవర్గంలో ఓటర్లు పోటా పోటీగా ఓటు హక్కు వినియోగించారు. పోలింగ్‌లో పురుషులతో సమానంగా మహిళలు ఓటు వేసేందుకు క్యూ కట్టారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మహిళా ఓటర్లు ఎక్కువశాతం పోలింగ్‌లో పాల్గొన్నారు. ఇందులో భాగంగా నియోజకవర్గంలో 238 పోలింగ్ కేంద్రాలు ఉండగా, 2,11,062 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 1,82,093 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇందులో పురుష ఓటర్లు 1,04,164 మందికి గాను 90962 మంది ఓటు వేసి 78.33 శాతం పోలింగ్ నమోదు చేశారు. మహిళా ఓటర్లు 106886 మందికి గాను 91126 మంది ఓటేసి 85.26 శాతం పోలింగ్ నమోదు చేశారు. ఇక ఇతరులు 7 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు.

పుట్టపర్తి మండలంలో 84.04శాతం పోలింగ్

పుట్టపర్తి మండలంలో మొత్తం ఓటర్లు 49,627 మంది ఉన్నారు. ఇందులో 41708 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. పురుష ఓటర్లు మొత్తం 24,412 మంది ఉండగా.. 20,694 మంది ఓటుహక్కు వినియోగించుకుని 85.40శాతం పోలింగ్ నమోదు చేశారు. మహిళలు 25,208 మంది ఉండగా 21,012 మంది ఓటు వేసి 84.26శాతం నమోదు చేశారు.

కొత్తచెరువు మండలంలో 88.10శాతం

మండలంలో మొత్తం ఓటర్లు 33,024 మంది ఓటర్లు ఉన్నారు. అందులో 28519 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పురుష ఓటర్లు మొత్తం 16,254 మంది ఉండగా.. 14,147 మంది ఓటు హక్కు వినియోగించుకుని 87.04 శాతం నమోదు చేశారు. మహిళలు 16,769 మంది ఉండగా 14,371 మంది ఓటుహక్కు వినియోగించుకుని 85.70శాతం నమోదు చేశారు.

బుక్కపట్నం మండలంలో 86.67 శాతం

మండలంలో మొత్తం ఓటర్లు 32,586 మంది ఉన్నారు. ఇందులో 28, 241 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. పురుష ఓటర్లు 16,147 మంది ఉండగా.. 14,150 మంది ఓటు వేసి 87.63 శాతం నమోదు చేశారు. మహిళా ఓటర్లు 16,439 మంది ఉండగా 14,091 మంది ఓటుహక్కు వినియోగించుకుని 85.72శాతం నమోదు చేశారు.

నల్లమాడ మండలంలో 87.25 శాతం

మండలంలో మొత్తం ఓటర్లు 33582 మంది ఉన్నారు. ఇందులో 29300 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. పురుష ఓటర్లు 16687 మంది ఉండగా 14878 మంది ఓటు వేసి 89.16 శాతం నమోదు చేశారు. మహిళలు 16,894 మంది ఉండగా 14,421 మంది ఓటు వేసి 85.36 శాతం నమోదు చేశారు.

ఓబుళదేవరచెరువు మండలంలో 86.28 శాతం

మండలంలో మొత్తం ఓటర్లు 39155 మంది ఉన్నారు. ఇందులో 33786 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. పురుష ఓటర్లు 19311 మంది ఉండగా.. 16895 మంది ఓటు వేసి 87.48 శాతం నమోదు చేశారు. మహిళా ఓటర్లు 19,848 మంది ఉండగా 16,891 మంది ఓటు వేసి 85.12 శాతం నమోదు చేశారు.

అమడగూరు మండలంలో 88.95 శాతం

మండలంలో మొత్తం ఓటర్లు 23,088 మంది ఉన్నారు. ఇందులో 20539 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. పురుష ఓటర్లు 11353 మంది ఉండగా.. 10198 మంది ఓటు వేసి 89.82 శాతం నమోదు చేశారు. మహిళలు 11,933 మందిలో.. 10,340 మంది ఓటు హక్కు వినియోగించుకుని 88.12 శాతం పోలింగ్ నమోదు చేశారు.

బంపర్ మెజారిటీతో గెలుస్తాం: మాజీ మంత్రి పల్లె

పుట్టపర్తిరూరల్, మే 15: సార్వత్రిక ఎన్నికల్లో బంపర్‌మెజారిటీతో గెలువబోతున్నామని మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం ఆయన నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఓటర్లను పెద్దఎత్తున సమీకరించి పోలింగ్‌కేంద్రాలకు వచ్చేలా చర్యలు తీసుకున్న కూటమి శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో కూటమికి ఏకపక్షంగా పోలింగ్ జరిగిందన్నారు. పల్లెసింధూరా రెడ్డి బంపర్‌మెజారిటతో గెలువనున్నారన్నారు. వృద్ధులు, మహిళలు అత్యధిక సంఖ్యలో ఓటు వేసేందుకు రావడం చూస్తుంటే ప్రభుత్వంపై వ్యతిరేకత ఎంత ఉందో అర్థమవుతోందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు కాబోతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు విజయ్ కుమార్, ఆదినారాయణరెడ్డి, శ్రీరామనాయక్, శ్రీరామిరెడ్డి, బొమ్మయ్య, పుల్లప్ప, ఆరుమండలాల కన్వీనర్లు, బూత్‌కమిటీ కన్వీనర్లు, మెంబర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి కుందికుంట పరామర్శ


మృతుడి కుటుంబసభ్యుల్ని పరామర్శిస్తున్న కందికుంట, (ఇన్‌సెట్లో) మృతుడు రమణ (ఫైల్)

నల్లచెరువు, మే 15: మండలంలోని మారిశెట్టిపల్లికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు మారిశెట్టి రమణ(65) గుండెపోటుతో బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న కూటమి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ వెంటనే ఆ గ్రామానికి వెళ్లి ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. తర్వాత కుటుంబ సభ్యులను పరామర్శించారు. టీడీపీ తరఫున అన్నివిధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కందికుంట వెంట టీడీపీ మండల కన్వీనర్ రాజశేఖర్, మాజీ ఎంపీపీ మాబూసాబ్, నాయకులు రామమోహన్, అంజనప్ప, అశ్వర్థనాయుడు, దేవేంద్రగౌడ్ తదితరులు ఉన్నారు.

జూన్ 4 వరకు 144 సెక్షన్ అమలు: డీఎస్పీ


మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసులు

ధర్మవరం, మే 15: ధర్మవరం సబ్ డివిజన్ పరిధిలో ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు జూన్ 4వతేదీ వరకు 144సెక్షన్ అమల్లో ఉంటుందని డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. పట్టణంలోని తన చాంబర్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జూన్ 4వతేదీన ఓట్ల లెక్కింపు పూర్తి అయ్యేవరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఎవరైనా హింసాత్మక ఘటనలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా ఎక్కడా గుంపులుగా ఉండకూదని, అనుమతి లేకుండా సభలు నిర్వహించరాదని అన్నారు. 144 సెక్షన్‌ను రాజకీయ పార్టీల నాయకులు దృష్టిలో పెట్టుకోవాలని ఆయన సూచించారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కదిరిఅర్బన్, మే 15: పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వెంకటేశ్వర ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థినులు కళాశాల లో సంప్రదించాలన్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ ఎస్ఈసీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ(ఎఫ్)కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇంగ్లిష్, తెలుగుమీడియంలు ఉన్నాయన్నారు. అర్హులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నల్లమాడ: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్ ఫస్ట్ ఇయర్, సెకెండ్ ఇయర్ ప్రవేశాలకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఉదయ్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. కాలేజీలో బైపీసీ, ఎంపీసీ, సీఈసీ గ్రూపులు ఉన్నాయన్నారు. అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జూనియర్ ఇంటర్ ప్రారంభం

గాండ్లపెంట: మండలకేంద్రంలోని గాండ్లపెంట జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో జూనియర్ ఇంటర్ విద్య ప్రారంభమవుతున్నట్లు ఎంఈఓ కృష్ణానాయక్ బుధవారం తెలిపారు. జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల ఆవరణలో నూతనంగా ఆధునిక గదులు నిర్మించామని, అందులో ఈ యేడాది విద్యాసంవత్సరం ప్రారంభం నుంచి తరగతులు జరుగుతాయని అన్నారు. మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులకు అడ్మిషన్లు ప్రారంభమయ్యాయన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధనకు నైపుణ్యంకలిగిన అధ్యాపకులు ఉన్నారన్నారు. అడ్మిషన్లకు ప్రధానోపాధ్యాయులు మధురాంబను సంప్రదించాలని సూచించారు.

డిగ్రీ ఫెయిలైన వారికి మెగా సప్లిమెంటరీ

కదిరిఅర్బన్, మే 15: డిగ్రీలో ఫెయిల్ అయిన అభ్యర్థులకు మెగా సప్లమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు పట్టణంలోని ఎస్‌టీఎస్ఎన్ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ స్మిత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1994-95 నుంచి 2014-15మధ్య కాలంలో బీఏ, బీకాం, బీఎస్సీ ఇయర్లీ సిస్టమ్‌లో చదివి, సబ్జెక్టులు పెండింగ్ ఉన్నవారికి ఎస్‌కే యూనివర్శిటీ చివరి అవకాశం కల్పిస్తోందన్నారు. పైన తెలిపిన సంవత్సరాల్లో డిగ్రీ చదివి, ప్రాక్టికల్స్‌లో ఫెయిల్ అయిన వారు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. ఇందుకు జూన్ 14వ తేదీలోగా ఫీజు చెల్లించాలన్నారు. మరిన్న వివరాలకు కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కదిరిఅర్బన్: పట్టణంలోని ఎస్‌టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ స్మిత ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సులలో చేరడానికి కళాశాలలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించినట్లు చెప్పారు. ఇంటర్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థులు, తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల లోపు కళాశాల కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం


గరుడ చిత్రంతో ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న దృశ్యం

ధర్మవరం, మే15: పట్టణంలో శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం రాత్రి ధ్వజారోహణ కార్యక్రమంతో ఘనంగా ప్రారంభమయ్యాయి. ముందుగా అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు ప్రాతఃకాల సమయాన అభిషేకాలు చేశారు. తరువాత నూతన వస్త్రాలతో అలంకరించారు. తర్వాత ధ్వజారోహణ కార్యక్రమంలో భాగంగా అంకురార్పణ, నవకుంబస్థాపన, గరుడప్రతిష్ఠ కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ చైర్మన్ నాగభూషణ, ఈఓ వెంకటేశులు, డైరెక్టర్లు పొరాళ్లపద్మావతి, జగ్గాజయలక్ష్మి, సత్రశాల సత్యనారాయణ పాల్గొన్నారు.

రేపటి నుంచి సంగమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

కొత్తచెరువు, మే 15: మండలకేంద్రంలోని సంగమేశ్వర స్వామి ఆలయంలో 17వ తేదీ శుక్రవారం నుంచి స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ ధర్మకర్తలు కేసీ మనోహర్, నటరాజ్, నాగేంద్రప్రసాద్, ఫణీంద్ర, గిరీశ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏడాది బ్రహ్మోత్సవాలు మే నెలలో వైశాఖ మాసశుద్ధనవమి నుంచి ప్రారంభమవుతాయన్నారు. ఈ క్రమంలో 17వ తేదీన సాయంత్రం ధ్వజారోహణం, 18న సాయంత్రం హంసవాహనంపై పార్వతీపరమేశ్వర ఉత్సవ విగ్రహాలు ఊరేగింపు, 19న సాయంత్రం బృంగి వాహనంపై, 20న సాయంత్రం శేషవాహనం, 21న సాయంత్రం నందివాహనంపై ఊరేగింపు కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 22న సాయంత్రం 6గంటలకు పార్వతీపరమేశ్వరకల్యాణోత్సవం, 23న ఉదయం 10:30గంటలక స్వామి రథోత్సవం జరుగుతుందన్నారు. 24న రాత్రి 7గంటలకు పార్వేట, 25న రాత్రి 9గంటలకు వసంతోత్సవం, పుష్పయాగం, ఉయ్యాల సేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని వారు పేర్కొన్నారు. భక్తులు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు.

ఆలయాలకు నీటి ట్యాంకుల వితరణ

ధర్మవరం, మే 15: ఉమ్మడి జిలాల్లోని పలు ప్రాంతాల్లోని నాలుగు దేవాలయాలకు నీటి ట్యాంకులను వితరణ చేసినట్టు యువర్స్ ఫౌండేషన్ ప్రతినిధులు వైకెశ్రీనివాసులు, డాక్టర్‌బీవీసుబ్బారావులు తెలిపారు. దాతలు వంకదారి రామచంద్రగుప్తా, నీరజాదేవి, షర్మిలాదేవి, హేలశాదేవి సహకారంతో వాటిని పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురం త్యాగరాజ స్వామి ఆలయం, సీకేపల్లి మండలంలోనిగువ్వలగొందిపల్లి గ్రామంలో గల అభయాంజనేయస్వామి ఆలయం, అనంతపురంజిల్లా నార్పలమండలం వెంకటంపల్లిలోని ఆంజనేయస్వామి ఆలయం, ధర్మవరం మండలంలోని గొట్లూరు ఆంజనేయస్వామి ఆలయానికి అందజేశామన్నారు. యువర్స్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

మసీదు నిర్మాణానికి విరాళం

తనకల్లు, మే 15: మండలంలోని నల్లగుట్టపల్లి వద్ద మసీదు నిర్మాణానికి కొర్తి కోట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, టీడీపీ సీనియర్ నాయకుడు ఎస్‌కే మస్తాన్‌వలి రూ. రెండు లక్షలు విరాళం అందజేశారు. గ్రామంలో మసీదు నిర్మాణానికి సాయం చేయాలని ముస్లింలు కోరగా, తన వంతు సాయంగా బుధవారం ఆయన విరాళం అందించారు. మసీదులో ముస్లిం పెద్దలతో సమావేశం నిర్వహించి వారి చేతికి చెక్కును అందించారు. ఆయనతో పాటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పంటరుణాలు రెన్యువల్ చేసుకోండి

గాండ్లపెంట, మే 15: మండలకేంద్రంలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో రుణాలు పొందిన రైతులు సకాలంలో రెన్యువల్ చేయించుకోవాలని మేనేజర్ భరత్‌ప్రవీణ్ బుధవారం ప్రకటనలో తెలిపారు. మండల వ్యాప్తంగా 3,100మంది రైతులు రుణాలు పొందారన్నారు. గడువులోగా పంట రుణాలు రెన్యువల్ చేయించుకుంటే, రూ.లక్షలోపు ఉన్నవారికి వడ్డీలేని రుణం వర్తిస్తుందన్నారు. రూ.లక్షపైన ఉన్నవారికి పావలా వడ్డీ వర్తిస్తుందన్నారు. రెన్యువల్‌కు వచ్చే రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధారం, బ్యాంక్ ఖాతా, వన్‌బీ తప్పక తీసుకురావాలని సూచించారు.

నల్లమాడ: మండలకేంద్రంలోని సహకార బ్యాంకులో రుణాలు తీసుకున్న రైతులు రెన్యువల్ చేసుకోవాలని సీఈఓ కేశవ్ప బుధవారం ప్రకటనలో తెలిపారు. రుణాలు పొందిన వారు రెన్యూవల్ చేసుకుంటే, ప్రభుత్వం నుంచి రాయితీలు అందుతాయన్నారు. అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఓపీఓలకు ఒకే రెమ్యునరేషన్ చెల్లించాలి

పుట్టపర్తిరూరల్ మే 15: సార్వత్రిక ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఓపీఓలందరికీ జిల్లా అంతటా ఒకే రకమైన రెమ్యూనరేషన్ చెల్లించాలంటూ ఎస్టీయూ జిల్లా అధ్యక్ష ప్రధానకార్యదర్శులు హరిప్రసాదరెడ్డి, చంద్రశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అనంతపురం జిల్లాలో ఓపీఓలకు ఎన్నికల రెమ్యూనరేషన్ రూ.1300 చెల్లిస్తున్నారని, అయితే శ్రీసత్యసాయి జిల్లా కదిరి నియోజకవర్గంలో రూ.650, ధర్మవరంలో రూ.500, చెల్లించడం ఏమిటని ప్రశ్నించారు. దీనిపై జిల్లా అధికారులు స్పందించి అందరికీ ఒకే రకమైన రెమ్యూనరేషన్ చెల్లించాలని వారు డిమాండ్ చేశారు.

గ్రామాల్లో సమస్యలు సృష్టిస్తే చర్యలు: ఎస్ఐ

బుక్కపట్నం, మే 15: గ్రామాల్లో ఎవరైనా సమస్యలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ సురేష్‌బాబు హెచ్చరించారు. మండలంలోని మరాలు, పాముదుర్తి గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో మాట్లాడుతూ.. ఎవరైనా గ్రామసభలు నిర్వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఓట్ల లెక్కింపు పూర్తయ్యేవరకు గ్రామాల్లో 144సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఎవరైనా గ్రామాల్లో గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఏస్ఐలు మస్తాన్, రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

రామాపురం, వడ్డిపల్లిలో నీటి ఎద్దడి

- ఇబ్బంది పడుతున్న గ్రామాల ప్రజలు


రామాపురంలో ట్యాంకర్ వద్ద నీటి కోసం గుమికూడిన గ్రామస్థులు

నంబులపూలకుంట, మే 15: మండలంలోని రామాపురం, వడ్డిపల్లి గ్రామాల్లో నీటి ఎద్దడి తీవ్రంగా ఉంది. దీంతో అక్కడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆయా గ్రామాల్లో సుమారు 110 కుటుంబాలు, నాలుగు వందల మంది జనాభా నివాసం ఉంటున్నారు. అలాగే రెండువేలకు పైగా మూగజీవాలు ఉన్నాయి. కాగా గత నెల రోజుల నుంచి నీటి సమస్య నెలకొంది. పంచాయతీ బోరు, చేతిపంపుల్లో భూగర్భ జలాలు అడుగంటడం వల్ల సమస్య తలెత్తింది. దీంతో ఈ గ్రామాలకు స్థానిక సర్పంచ్, అధికారులు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. ఒక్కొక్క గ్రామానికి ఒక ట్యాంకర్ చొప్పున సరఫరా చేస్తుండడంతో.. అవి ఎక్కడా సరిపోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. మూగజీవాలు, పాడిపైన ఆధారపడి జీవనం సాగించే గ్రామాలకు నీరు మరింత అవసరముందని అంటున్నారు. స్థానిక నాయకులు, అధికారులు తూతూమంత్రంగా నీటిని అందించి చేదులు దులుపుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. గ్రామాలకు మరిన్ని ట్యాంకర్లతో నీటిని సరఫరా చేయాలని, లేకపోతే సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వారు కోరుతున్నారు.

ప్రధాన రహదారిపై మురుగునీరు

- అసౌకర్యానికి గురవుతున్న స్థానికులు


ప్రధాన రహదారిపై పారుతున్న మురుగునీరు

ఓబుళదేవరచెరువు, మే 15: మండలకేంద్రంలో కదిరి, హిందూపురం ప్రధాన రహదారిపై మురుగునీరు ప్రవహిస్తోంది. దీంతో ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా రోడ్డు సమీపంలో బీసీకాలనీ ఉంది. ఆ కాలనీలో మురుగునీటి కాలువల సౌకర్యం లేదు. దీంతో దిగువ ప్రాంతంలోని ఇళ్లలోని మురుగునీరంతా వీధుల్లోకి వచ్చి రోడ్డుపై పారుతోంది. దీంతో వాహనాలు రాకపోకల సమయంలో మురుగునీరు పాదచారులపైకి, రోడ్డుపక్కన ఇళ్లపైకి చిట్లుతున్నాయి. దీంతో మురుగు వల్ల దుర్గంధం వెదజల్లుతోందని, భరించలేకున్నామని స్థానికులు వాపోతున్నారు. ప్రధాన రహదారిపైనే ప్రజాప్రతినిధులు, అధికారులు నిత్యం వెళుతుంటారని, వారు చూసీచూడనట్లు వెళుతున్నారే కానీ.. మురుగునీరు నివారణకు చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన చెందుతున్నారు. మురుగునీరు ప్రవహిస్తుండడంతో దోమలు సైతం స్వైర విహారం చేస్తున్నాయని, తద్వారా వ్యాధుల బారిన పడాల్సి వస్తోందని అంటున్నారు. ఇప్పటికైనా సంబంధితాధికారులు స్పందించి రోడ్డుపై మురుగునీరు ప్రవహించకుండా చూడాలని వారు కోరుతున్నారు.

ముందస్తు అడ్మిషన్లను కట్టడి చేయాలి: ఏఐఎస్ఎఫ్

అనంతపురం విద్య, మే 15: జిల్లాలో స్కూళ్లు, కళాశాలల్లో సాగుతున్న ముందస్తు అడ్మిషన్లను వెంటనే అధికారులు కట్టడి చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఆ సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమణయ్య, ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా కార్పొరేట్ విద్యాసంస్థలు ముందస్తు అడ్మిషన్లు ఇష్టారాజ్యంగా చేస్తున్నాయన్నారు. మే లో ఒక రకం ఫీజు, జూన్‌లో మరో రకం ఫీజు అంటూ చెబుతూ.... విద్యార్థుల తల్లిదండ్రులను మాయ చేస్తున్నారని తెలిపారు. కొన్ని స్కూళ్లకు అనుమతులు లేకున్నా..... ఇబ్బదిముబ్బడిగా ఫీజులు పెంచేసి.. అడ్మిషన్లు చేసుకుని సొమ్ము చేసుకుంటున్నారన్నారు. ఇప్పటికే కొన్ని స్కూళ్లలో అడ్మిషన్లు పూర్తి చేశారని, నిబంధనలు ఉల్లంఘించిన స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. డీఈఓ, ఆర్ఐఓ కార్యాలయ అధికారులు ఎన్నికల డ్యూటీలో ఉండటం వల్ల యాజమాన్యాలు అడ్డగోలుగా వ్యవహరిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ముందస్తు అడ్మిషన్లపై, అనుమతులు లేని స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా బస్ షెల్టర్



నిరుపయోగంగా ముదిగుబ్బ బస్ షెల్టర్


ఎండలో బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

- శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా మారిన వైనం
- బస్సుల కోసం ప్రయాణికులు రోడ్లపై పడిగాపులు

ముదిగుబ్బ, మే15: ప్రయాణికుల సౌకర్యార్థం మండలంలో పలుచోట్ల నిర్మించిన బస్‌షెల్టర్లు నిరుపయోగంగా మారాయి. ముఖ్యం గా మండల కేంద్రంలోని బస్ షెల్టర్‌ను 2001లో అప్పటి డీఎస్పీ రెడ్డయ్య ముదిగుబ్బలోని వ్యాపారులు, గ్రామస్థుల సహకారంతో నిర్మించారు. అయితే అది ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుని యాచకులకు, వ్యసనపరులకు నిలయంగా మారింది. ఈ బస్ షెల్టర్ వద్ద చెత్తాచెదారం కూడా పేరుకుపోవడంతో కనీసం నిల్చోవడానికి కూడా వీలు లేకుండా ఉంది. చేసేదిలేక ప్రయాణికులు బస్సుల కోసం సమీపంలోని దుకాణాల ముందు నిలబడి ఎదురు చూడాల్సి వస్తోంది. ఎండకు, వర్షాలకు రోడ్డుపై గంటల తడబడి నిలబడాలంటే చిన్నపిల్లల తల్లులు, చిన్నారులు, వృద్ధులు అవస్థలు పడుతున్నారు. ప్రయాణికులు షెల్టర్ వద్ద ఉండకపోవడంతో బస్సులు కూడా అక్కడికి వెళ్లడం లేదు. డ్రైవర్లు రోడ్డుపైనే ఆపి ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. ఈ క్రమంలో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. బస్‌షెల్టర్‌ను మరమ్మతు చేసి వినియోగంలోకి తెస్తే ఏ సమస్య ఉండదని స్థానికులు అంటున్నారు. ఆ దిశగా అధికారుల చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.


బస్‌షెల్టర్‌కు మరమ్మతులు చేయించాలి



బస్సుల కోసం ప్రయాణికులు దుకాణాల ఎదుట రోడ్డుపై నిలబడుతున్నారు. దీంతో దుకాణాల యజమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయినా తప్పని పరిస్థితిల్లో వారు మాటలు పడుతూ అలాగే నిలబడాల్సి వస్తోంది. బస్‌షెల్టర్ మరమ్మతు చేసి వినియోగంలోకి తెస్తే ఈ తిప్పలు తప్పుతాయి.

- జీటీ రాధాకృష్ణ, ముదిగుబ్బ

ఇబ్బందులు పడుతున్నాం..



బస్సు షెల్టర్ సరిగా లేకపోవడంతో అనంతపురం, కదిరి, పులివెందులకు వెళ్లే ప్రయాణికులు రోడ్లపై ఎండలో గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. బస్‌షెల్టర్ వినియోగంలోకి తెస్తే రోడ్లపై నిలబడే పరిస్థితి ఉండదు. ఇంకా ఎన్నాళ్ల ఈ బాధలు భరించాలో అర్థం కావడం లేదు.

- గోగుల శ్రీనివాసులు, ముదిగుబ్బ

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రత పరిశీలన


స్ట్రాంగ్ రూమ్‌లు తనిఖీ చేస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

హిందూపురం, మే 15 : ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రత ఏర్పాట్లను ఎస్పీ మాధవ రెడ్డి పరిశీలించారు. ఆయన బుధవారం నాయనపల్లి వద్ద ఉన్న బిట్ కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత ఏర్పాట్లను పరిశీలించి, వారికి సూచనలు అందించారు. అక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు, కమాండ్ కంట్రోల్‌రూమ్‌ను తనిఖీ చేశారు. స్ట్రాంగ్ రూమ్ లవద్ద కేంద్ర సాయుధ బలగాలు ఆర్మీ రిజర్వ్‌డ్ బలగాలు, సివిల్ పోలీసు బలగాలు 24గంటలపాటు మోహరించి ఉంటాయన్నారు. 144సెక్షన్ అమలు లో ఉంటుందన్నారు. ప్రతి స్ట్రాంగ్ రూమ్ పరిసరాల్లో సీసీటీవీ కెమెరాలతో ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. విద్యుత్ అంతరాయం లేకుండా జనరేటర్ సౌకర్యం కల్పించామన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. వచ్చేనెల 4న ఓట్ల లెక్కింపు ముగిసేవరకు సీసీ కెమెరాల్లో రికార్డు అయిన దృశ్యాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తామన్నారు. ఎవరైనా అపోహాలు సృష్టిస్తే, తప్పుడు సమాచారాలను నమ్మి ఏవైనా అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే అలాంటి వారిపై తీవ్రంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్పీ వెంట డీఎస్పీ కంజక్షన్, రిజర్వ్ డీఎస్పీ విజయ్‌కుమార్, సీఐలు, ఎస్ఐలు ఉన్నారు.

గ్రంథాలయంలో సమ్మర్ క్యాంప్

బత్తలపల్లి, మే 15: మండలకేంద్రంలోని గ్రంథాలయంలో బుధవారం సమ్మర్ క్యాంప్‌ను ప్రారంభించినట్టు గ్రంథాలయాధికారి రాజేశ్వరి తెలిపారు. ఈ క్యాంప్ జూన్7వతేదీ వరకు నిర్వహిస్తామన్నారు. ఈ క్యాంప్‌లో తొలిరోజు 8 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. వీరికి కథలు చెప్పడం, చదివించడం, చెస్, కేరమ్ నేర్పించడం జరిగిందని రాజేశ్వరి తెలిపారు.

ఘనంగా శంకరాచార్యుల జయంతి



శంకరాచార్యుల చిత్రపటాన్ని ఊరేగిస్తున్న బ్రాహ్మణులు

చిలమత్తూరు, మే 15: జగద్గురు ఆదిశంకరాచార్యుల జయంతి వేడుకలను బుధవారం మండల బ్రాహ్మణ సంఘం నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అద్వైత వేదాంత సిద్ధాంతాన్ని ప్రచారం చేసిన భారతీయ తత్వవేత్త, వేదాంతి శంకరాచార్యులని బ్రాహ్మణ సంఘం నాయకులు పేర్కొన్నారు. అటువంటి మహాత్ముడి జయంతి వేడుకలను ప్రతి హిందువు జరుపుకోవాలన్నారు. ఆయన చూపిన మార్గాన్ని ప్రతి ఒక్కరు అనుసరించాలన్నారు సమాజ హిత కోసం ఆయన కృషి వెలకట్టలేనిదన్నారు. ఆయన చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రధాన వీధుల్లో ఊరేగించారు.

గురుకుల ప్రవేశానికి

దరఖాస్తుల ఆహ్వానం

గోరంట్ల, మే 15: మండలకేంద్రాలైన పెనుకొండ, గోరంట్లలో గిరిజన గురుకుల పాఠశాలల్లో ఖాళీలకు ఈ నెల 20వ తేదీలోగా అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని గోరంట్ల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ విజయకుమార్ బుధవారం ప్రకటనలో తెలిపారు. గోరంట్ల పాఠశాలలో 3తరగతి ప్రవేశానికి 40సీట్లుకుగాను బీసీల కు రెండు, ఓసీ ఒకటి, ఎస్టీ 32, ఎస్సీ 5 సీట్లు ఉన్నాయ న్నారు. అలాగే గిరిజన బాలికల కోసం 4వతరగతిలో 36, ఐదులో 29, ఆరులో 7, ఏడులో 5, 8లో ఒకటి, తొమ్మిదో తరగతిలో ఎనిమిది సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. పాఠశాలలో చేరేవారు ఇతర వివరాలకోసం సెల్ ఫోన్ నంబరు 9398624224ను సంప్రదించాలన్నారు. అలాగే పెనుకొండ పాఠశాలలో నాలుగో తరగతిలో 35, ఐదులో 31, ఆరులో 32, ఏడులో 11, ఎనిమిదిలో 8, తొమ్మిదో తరగతిలో 18సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఇందుకోసం ఇతర వివరాలకు సెల్ ఫోన్ నంబరు 8332037233కు సంప్రదించాలని పెనుకొండ పాఠశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ విజయకుమార్ తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలపై

ప్రత్యేక దృష్టి : ఎస్ఐ

అగళి, మే 15 : అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నట్లు ఎస్ఐ వీరేష్ తెలిపారు. ఎన్నికలు పూర్తయిన నేపథ్యంలో గ్రామాలలో ఎన్నికల కౌంటింగ్ జరిగే వరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. కర్ణాటక మద్యం రవాణా, జూదం, మట్కా, కొత్త వ్యక్తులు సంచారం తదితర వాటిపై ప్రత్యేకంగా నిఘా ఉంచినట్లు తెలిపారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన బుధవారం ఆలూడి, పీ బ్యాడిగెర, బొమ్మరసనపల్లిలో చెక్‌పోస్టులను పరిశీలించారు. గ్రామాల్లో పర్యటించి అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు.

రెస్టారెంట్ల తనిఖీ

హిందూపురం అర్బన్, మే 15: రెస్టారెంట్లకు ఆహార భద్రత శాఖ అనుమతులు తప్పనిసరిగా ఉండాలని ఆహార భద్రతా అధికారి తస్లీం అన్నారు. ఆమె బుధవారం పట్టణంలోని సరిగమ ఫ్యామిలీ రెస్టారెంట్, తాడిపత్రి బిర్యానీ రెస్టారెంట్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రెస్టారెంట్‌లో ఆహార భద్రత చట్టం ప్ర కారం అనుమతులు ఉండాలని, అదే విధంగా నాణ్యమైన ఆహార పదార్థాలు మాత్రమే వినియోగదారులకు అందించాలని సూచించారు. రెస్టారెంట్లలో వండిన ఆహార పదార్థాలను క్షుణ్ణంగా పరిశీలించారు. కొన్ని పదార్థాలను పరీక్ష నిమిత్తం తీసుకెళ్లారు.

అతిగా మద్యం తాగడంతో అస్వస్థత

గోరంట్ల, మే 15: మండలంలోని మాల్లాపల్లికి చెందిన శ్రీనివాసులు బుధవారం అతిగా మద్యం తాగి, అస్వస్థతకు లోనయ్యాడు. శ్రీనివాసులు ఎన్నికల సందర్భంగా రెండురోజులుగా ఉచితంగా పంపిణీ చేసిన మద్యాన్ని అధికంగా తాగాడు. సరిగా ఆహారం తీసుకోకపోగా బుధవారం అలాగే మద్యాన్ని సేవించినట్లు బంధువులు తెలిపారు. దీంతో మధ్యాహ్నం ఉన్నఫలంగా స్పృహకోల్పోయి అపస్మారక స్థితికి చేరుకున్నట్లు తెలిపారు. అతడిని గోరంట్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం పుట్టపర్తికి తీసుకెళ్లారు.

వైద్య శిబిరానికి స్పందన

పావగడ, మే 15: బెంగళూరు సప్తగిరి ఆస్పత్రి, పావగడ హెల్ప్‌సొసైటీ ఆధ్వర్యంలో తాలూకాలోని లింగదహళ్లిలో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. దాదాపు 400 మందికి పైగా వైద్యశిబిరంలో పాల్గొనగా 38 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపికైనట్లు హెల్ప్ సొసైటీ అధ్యక్షుడు మానం శశికిరణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసరా ఫౌండేషన్ సభ్యుడు అమిలినేని నరసింహమూర్తి, సప్తగిరి ఆస్పత్రి వైద్యులు డాక్టర్ హరీష్, గ్రీష్మ, గగన, ఆనంద్, గ్రామ పంచాయతీ సభ్యులు పాల్గొన్నారు.

కోనాపురంలో తీవ్ర తాగునీటి సమస్య



మరమ్మతులకు గురైన మోటారు

పెనుకొండ రూరల్, మే 15: పెనుకొండ నగర పంచాయతీలోని కోనాపురంలో వారం రోజులుగా తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొంది. గ్రామంలో మూడు బోరుబావులుండగా రెండు మరమ్మతులకు గురయ్యాయి. ఒక బోరుబావి నుంచి వచ్చే తాగునీరు గ్రామానికి సరిపోక గ్రామస్థులు వ్యవసాయబోర్లను ఆశ్రయిస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కౌన్సిలర్లు, నగర పంచాయతీ అధికారులు స్పందించాలని గ్రామస్థులు కోరుతున్నారు. చెడిపోయిన బోరుబావులకు మరమ్మతులు చేయించాలని విన్నవిస్తున్నారు.

టీడీపీ కూటమికి బంపర్ మెజార్టీ

ఎమ్మెల్యే అభ్యర్థి సవిత



గోరంట్లలో పోలింగ్ కేంద్రాల వారీగా సమీక్షిస్తున్న సవిత

గోరంట్ల, మే 15: పెనుకొండ నియోజకవర్గంలో టీడీపీ కూటమి బంపర్ మెజార్టీతో విజయం సాధించబోతోందని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సవిత అన్నారు. గోరంట్లలోని పార్టీ కార్యాలయంలో కూటమి నాయకులు, కార్యకర్తలతో ఆమె బుధవారం సమావేశమయ్యారు. పోలింగ్ కేంద్రాల వారీగా పోలింగ్ సరళి, పోలైన ఓట్లు, అనుకూల, ప్రతికూల పరిస్థితులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ... ప్రజలను పెద్దఎత్తున సమీకరించి పోలింగ్ కేంద్రాలకు వచ్చేలా చేసిన కూటమి నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో టీడీపీకి అనుకూలంగా ఓటింగ్ జరిగినందున మంచి మెజార్టీతో గెలవబోతున్నట్లు ఆశాభావం వ్యక్తం చేశారు. పోలింగ్ రోజు ఉదయం 9గంటలకే రాష్ట్రంలో కూటమికి అనుకూల పవనాలు వీస్తున్నాయని, ప్రభజనం సృష్టించబోతోందని అర్థమైందన్నారు. వృద్ధులు, మహిళలు, పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరడం, స్వచ్ఛందంగా ఓటు వేయడానికి ఉత్సాహంగా రావడం చూస్తే ప్రభుత్వ వ్యతిరేకత వారిలో కొట్టొచ్చినట్లు కనిపించిందన్నారు. భారీ మెజార్టీతో టీడీపీ కూటమి రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతోందని తెలిపారు. ఈ సమావేశంలో టీడీపీ మండల కన్వీనర్ సోమశేఖర్, బాలక్రిష్ణచౌదరి, బెల్లాలచెరువు చంద్ర, ఉత్తమరెడ్డి, నరేష్, హరిచౌదరి, జనసేన, బీజేపీ నాయకులున్నారు.

నాయకుల్లో తగ్గని జోష్

పెనుకొండ టౌన్(సోమందేపల్లి): పోలింగ్ ముగిసి మూడు రోజులు కావస్తున్నా టీడీపీ నాయకుల్లో జోష్ తగ్గడం లేదు. నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన మహిళలు బుధవారం పెనుకొండలో టీడపీ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థి సవితను కలిసి అభినందనలు తెలిపారు. అలాగే సోమందేపల్లిలోని టీడీపీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సవిత సమావేశం నిర్వహించారు. ఎన్నికల్లో సహరించినందుకు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు పాలడుగు చంద్ర, సీసీ హరి, టీడీపీ మండల కన్వీనర్ సిద్దలింగప్ప తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం అర్బన్: టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తల ఆప్యాయత, అనురాగాలు మరువలేనివని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సవిత అన్నారు. ఆమె బుధవారం పరిగి మండల కేంద్రంలో కూటమి నాయకులు కార్యకర్తలతో సమావేశం నిర్వహించి మాట్లాడా రు. సార్వత్రిక ఎన్నికల్లో మీరు చూపిన ఆదరాభిమానాలు వృథా కావన్నారు. కార్యక్రమానికి మండలం నుంచి పెద్ద ఎత్తున టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.



పెనుకొండలో సవితను కలిసిన టీడీపీ మహిళా కార్యకర్తలు

మడకశిరలో 87.5 శాతం పోలింగ్

- పెరిగిన ఓటింగ్
- బూత్‌లవారీగా ఓట్ల లెక్కలపై ప్రధాన పార్టీల ఆరా

మడకశిర, మే15: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ముగిసింది. ఇక లెక్కింపు మాత్రమే మిగిలింది. ఫలితాలు తెలుసుకోవడానికి 20 రోజుల పాటు వేచి చూడాల్సి ఉంది. అయితే ఎన్నికల్లో పోటీచేసిన అభ్య ర్థులతో పాటు రాజకీయ నాయకులు, కార్య కర్తలు, ప్రజలు ఫలితాలపై అంచనాలు మొదలు పెట్టారు. ఎక్కడ చూసినా, ఏ ఇద్దరు కలిసినా ఇదే చర్చ జోరుగా సాగుతోంది. అన్ని పార్టీల అభ్యర్థుల భవిత్యం ఈవీఎం బాక్స్‌లలో నిక్షిప్తం అయింది. మొత్తంగా ప్రధాన పార్టీలైనే టీడీపీ, వైసీపీ మధ్యనే పోటీ నెలకొంది. ఎన్నికల్లో పోటీ చేసిన ప్రధాన పార్టీల అభ్యర్థులు వారి అనుచరులతోను, తమ పార్టీ నాయకులతో పోలింగ్ సరళిపై ఆరా తీస్తున్నారు. గతంలో కంటే ఈ సారి పోలింగ్ శాతం బాగా పెరిగింది. దీంతో ఎవరికి లాభం అనే దానిపై చర్చసాగుతోంది. పోలింగ్ కేంద్రాల వారీగా పోలైన ఓట్ల లెక్కలను సేకరించే పనిలో ప్రధాన పార్టీల నాయకులు నిమగ్నమయ్యారు. నియోజకవర్గంలో 87.5శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 2,10,804 మంది ఓటర్లు ఉండగా 1,84,524 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పురషులు 1,05,760 మందికి గాను 93,487 మంది, మహిళలు 1,05,043 మందికి గాను 91,037 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు.



మడకశిరలో క్యూలో ఉన్న ఓటర్లు (ఫైల్)

విజయంపై ఎవరి ధీమా వారిదే..

మడకశిరటౌన్: నియోజకవర్గంలో ఎన్నికల పోలింగ్ ముగియడంతో విజయంపై ఇరుపార్టీల జ్యుజుజీ తమదే గెలుపు అంటే తమదే గెలుపు అంటున్నారు. నియోజకవర్గం వ్యాప్తంగా ఈ సారి అత్యధికంగా 87.5 శాతం పోలిం గ్ నమోదు కావడం ప్రతి పక్షానికి అనుకూలిస్తుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇది అధికార పార్టీకి నష్టం చేకూర్చే విధంగా ఉందని అంచనా వేస్తున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా అధికంగా తరలివచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారని అంటున్నారు. టీడీపీ విజయం తథ్య మని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహం నెలకొంది. నియోజకవర్గంలో పురుషులు అత్యధికంగా ఓటింగ్‌లో పాల్గొనడం, యువత తరలివచ్చి ఓటు వేయడంతో టీడీపీకి కలిసివచ్చే అంశంగా చెబుతున్నారు. ఇదిలా ఉంటే మహిళలు, వృద్ధులు తమకే ఎక్కువగా ఓట్లు వేశారని, అది తమకు కలిసి వస్తుందని వైసీపీ వారు అంచనా వేస్తూ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా టీడీపీ, వైసీపీల మధ్యనే పోరు నెలకొంది. జూన్ 4వతేదీ జరిగే లెక్కింపులో విజయం ఎవరిని వరిస్తుందో వేచి చూడాలి.

రోడ్డుకు అడ్డంగా చెట్టు

గోరంట్ల, మే 15: మండలంలోని వానవోలు గ్రామ సమీపంలో రెండురోజు క్రితం రోడ్డుకు అడ్డంగా పడినచెట్లను తొలగించకపోవ డంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. వానవోలు సమీపంలోని రంగనాధ స్వామి ఆలయం వద్ద సోమవారం గాలివాన కారణంగా చెట్టురోడ్డుపై పడిపోయింది. స్థానిక ప్రజలు ద్విచక్రవాహనాలు, ఆటోలు వెళ్లడానికి వీలుగా ఒక కొమ్మను తొలగించారు. మిగిలిన చెట్టు మొత్తం రోడ్డుపైనే వాలి ఉంది. ఈ మార్గం గుట్టిపల్లి, కొలిమిపల్లి, గుట్టిపల్లితండాలకు ప్రధాన రహదారి, రాత్రిళ్ల ప్రమాదాలు జరిగే అవకాశముందని, అధికారులు వెంటనే స్పందించి చెట్లును తొలగించాలని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు.



గుట్టిపల్లి రహదారిలో రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టు

గ్రామీణ విద్యార్థుల ప్రతిభకు పెద్దపీట : ఏటీఎల్

రొళ్ల, మే 15: గ్రామీణ ప్రాంతంలో ఇష్టంగా చదివే బాలబాలికలను ప్రోత్సహించడమే ఆర్డీటీ ముఖ్య ఉద్దేశమని ఆర్డీటీ రొళ్ల ఏరియా టీమ్ లీడర్ ఓబుళేశు పేర్కొన్నారు. ఆర్డీటీ ప్రాంతీయ కార్యాలయంలో బుధవారం రొళ్ల, అగళి మండలాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదివి 500 మార్కులు పైబడి సాధించిన 46 మంది విద్యార్థులకు ఈనెల 19న ఆర్డీటీ ఆధ్వర్యంలో ఆర్డీటీసెట్ ప్రతిభా పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. అందులో ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు ఆరు సంవత్సరాల కార్పొరేట్ ఎడ్యుకేషన్ కల్పించనున్నట్లు ఏటీఎల్ తెలిపారు. సంస్థ సిబ్బంది హనుమంతరాయుడు, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో రచ్చబండ రాజకీయాలు



మడకశిర రూరల్, మే 15 : సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సోమవారం ముగిసింది. ఎన్నిల ప్రారంభం నుంచి పోలింగ్ వరకు జరిగిన పరిణామాలు, పోలింగ్ సరళిపై గ్రామాల్లో ఉన్న రచ్చబండలపై ప్రజలు కూర్చొని చర్చించుకుంటున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల తేదీ ప్రకటించినప్పటి నుంచి పోలింగ్‌కు రెండు రోజుల ముందు వరకు ప్రధాన పార్టీలు గ్రామాల్లో విస్తృతంగా ఎన్నిల ప్రచారం నిర్వహించాయి. ఆయా పార్టీలకు చెందిన కొంత మంది స్థానిక నాయకులు తమ పార్టీకి బాగా ఓటు వేయించి మంచి మెజార్టీ తీసుకురావాలని పట్టుదలతో పనిచేశారు. మరికొన్ని గ్రామాల్లో నిశ్శబ్దంగా ఉండి ఓటర్లకే అవకాశాన్ని వదలివేశారు. మరి కొంతమంది గ్రామాల్లో ఓటర్లకు నగదు పంపిణీ చేసినట్లు, అందులో పూర్తిగా వ్యత్యాసం చూపించినట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. దాని ప్రభావం కూడా ఓటర్ల గమనించి ఓటువేశారని చర్చించుకుంటున్నారు. కొన్ని గ్రామాల్లో వలస కూలీలు వచ్చి తమ పార్టీకి ఓటు వేస్తే రానుపోను ఖర్చులు ఇ స్తామని చెప్పిన కొంత మంది నాయకులు, ఓటువేసిన తరువాత చేతులెత్తేసినట్లు సమాచారం. విధిలేని పరిస్థితుల్లో నిరాశతో వలస కూలీలు విధులకు వెళ్లిపోయారని జరిగిన పరిణామాలపై ఆయా గ్రామాల్లో రచ్చబండలపై కూర్చుని చర్చించుకుంటున్నారు.

‘పురం’లో నీటికి కటకట

- 15 రోజులుగా సరఫరా కాని మునిసిపల్ నీరు
- ప్రైవేటు ట్యాంకర్లతో కొనుక్కొంటున్న ప్రజలు
- నెలకు రూ.1500 అదనపు ఖర్చు



కొనుగోలు చేసిన ట్యాంకర్ నుంచి నీటిని పట్టుకుంటున్న దృశ్యం

హిందూపురం అర్బన్, మే 15: వేసవి ముగుస్తోంది. హిందూపురంలో మాత్ర నీటి సమస్య తీరలేదు. పట్టణ వ్యాప్తంగా మునిసిపాలిటీ సరఫరా చేసే నీరు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేట్ ట్యాంకర్లతో నీటిని కొనుక్కొని వాడుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. ఇప్పటికే ఆకాశాన్నంటే నిత్యవసరాల ధరలతో ప్రజలు సతమతమవుతున్నారు. దీనికి తోడు తాగునీటి కోసం నెలకు రూ.1500 అదనంగా ఖర్చు పెట్టాల్సి వస్తోందని పట్టణ ప్రజలు వాపోతున్నారు. దీంతో కుటుంబం ఖర్చు మరింత పెరిగి తీవ్ర ఇబ్బంది లు ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు వేసవి కాలం వచ్చిందంటే హిందూపురంలో నీటి ఎద్దడి ఎక్కువగా కనిపించేది. కానీ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ చొరవతో రూ.194 కోట్లతో గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి పైప్‌లైన్ ద్వారా నీటిని సరఫరా చేయడంతో ఆ సమస్య కనుమరుగైంది అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత మళ్లీ పట్టణంలో నీటి సమస్య అధికమైంది. గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి నీరు సక్రమంగా సరఫరా అయితే టీడీపీకి, బాలకృష్ణకు పేరు వస్తుందనే భావనతో పైపులు మరమ్మతులకు వచ్చినా, విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినా వైసీపీ పాలకులు సరిగా స్పందించడంలేదన్న విమర్శలు వినిపిస్తున్నా యి. దీంతో పాటు కొంతమంది మునిసిపల్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్య ధోరణి వల్ల పట్టణంలో నీటి సరఫరా అంతంతమాత్రంగానే ఉందన్న విమర్శలూ లేకపోలేదు. ముఖ్యంగా పలువురు పిట్టర్లు, వాటర్‌మన్‌లు నిర్వాకం వల్ల నీటి సరఫరా విభాగంలో పెద్ద ఎత్తున అక్రమ కనెక్షన్ల వ్యవహారం నడుస్తోందని మునిసిపల్ శాఖలోని కొంత మంది చర్చించుకోవడం విశేషం. కొన్ని అపార్టుమెంట్‌లకు, హోటళ్లకు అధికంగా నీరు సరఫరా ఏర్పాట్లు ఉండడంతో ప్రజలకు నీరు సక్రమంగా అందడం లేదనే విమర్శలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. అంతే కాకుండా పలువురు కౌన్సిలర్లు జులుం ప్రదర్శించడం వల్ల అక్రమ కనెక్షన్‌లు విచ్చల విడిగా వెలిసిన ట్లు తెలుస్తోంది. దీంతో ప్రభుత్వానికి పన్నులు సక్రమంగా చెల్లించే వారు ఇబ్బందులు పడుతు న్నారు. పట్టణంలో వారానికి కనీసం రెండు సార్లు నీరు అందించాల్సి ఉంది. కానీ గొల్లపల్లి నుంచి నీరు సరఫరా కావడం లేదనే నెపంతో ప్రజలను మోసం చేస్తున్నారు. దీంతో అవస రానికి నీరు కొనాల్సి వస్తోంది. ఇప్పుడు పట్టణంలో 15 రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయి పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మునిసిపల్ నీటి సరఫరా సిబ్బందిని అడిగితే గొల్లపల్లి రిజర్వియర్ వద్ద విద్యుత్ బోర్డులో మరమ్మతుల కారణంగా నీటి సరఫరాకు ఇంకా వారం రోజులు పట్టవచ్చని చెబుతున్నారు. దీంతో ప్రైవేటు ట్యాంకర్లపై ఆధార పడక తప్పదని పట్టణ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ సరఫరాలో సమస్య ఉంది

- బాలసుబ్రహ్మణ్యం, మున్సిపల్ డీఈ

గొల్లపల్లి రిజర్వాయర్‌లో నీటి సరఫరా ఆగింది. అక్కడ విద్యుత్ సరఫరాలో మరమ్మతుల కారణంగా హిందూపురానికి నీరు అందించలేకపోతున్నాం. మూడు రోజుల నుంచి సిబ్బంది అన్ని విధాలా ప్రయత్నాలు చేశారు. కానీ మర మ్మతులు కావడం లేదు. బుధవారం విద్యుత్‌శాఖ అధికారులను కూడా పిలిచాం. వారి సహకారంతో మరమ్మతులు చేపట్టి నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకుంటాం. ఇంకా మూడు రోజులు సమయం పట్టవచ్చు.

నీటి సరఫరాకు రెండు రోజులు అంతరాయం

● మునిసిపల్ కమిషనర్ శ్రీకాంత్

హిందూపురం పట్టణ ప్రాంతంలో మునిసిపల్ నీరు అందించే విషయంలో అంతరాయం ఏర్పడినట్లు మునిసిపల్ కమిషనర్ శ్రీకాంత్ ఓ ప్రకటన ద్వారా తెలియజేశారు. గొల్లపల్లి రిజర్వాయర్ ఎస్‌కేడీ వాటర్ లిఫ్టింగ్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్, ప్యానల్ బోర్డులో మరమ్మతుల కారణంగా రెండు రోజుల పా టు నీటి సరఫరాకు అంతరాయం కలుగవచ్చన్నారు. ఇప్పటికే మునిసపల్ సిబ్బంది, విద్యుత్ శాఖ అధికారులు మరమ్మతు పనులు చేపట్టారన్నారు. వాటిని సరిచేసేందుకు రెండు రోజుల సమయం పడుతుందని, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

స్ట్రాంగ్ రూమ్‌ల భద్రత పరిశీలన



స్ట్రాంగ్ రూమ్‌లను తనిఖీ చేస్తున్న ఎస్పీ

హిందూపురం, మే 15 : ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రత ఏర్పాట్లను ఎస్పీ మాధవ రెడ్డి పరిశీలించారు. ఆయన బుధవారం నాయనపల్లి వద్ద ఉన్న బిట్ కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత ఏర్పాట్లను పరిశీలించి, వారికి సూచనలు అందించారు. అక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు, కమాండ్ కంట్రోల్‌రూమ్‌ను తనిఖీ చేశారు. స్ట్రాంగ్ రూమ్‌లవద్ద కేంద్ర సాయుధ బలగాలు ఆర్మీ రిజర్వ్‌డ్ బలగాలు, సివిల్ పోలీసు బలగాలు 24గంటలపాటు మోహరించి ఉంటాయన్నారు. 144సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ప్రతి స్ట్రాంగ్ రూమ్ పరిసరాల్లో సీసీటీవీ కెమెరాలతో ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. విద్యుత్ అంతరాయం లేకుండా జనరేటర్ సౌకర్యం కల్పించామన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. వచ్చేనెల 4న ఓట్ల లెక్కింపు ముగిసేవరకు సీసీ కెమెరాల్లో రికార్డు అయిన దృశ్యాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తామన్నారు. ఎవరైనా అపోహలు సృష్టిస్తే, తప్పుడు సమాచారాలను నమ్మి ఏవైనా అవాంచనీయ సంఘటనలకు పాల్పడితే అలాంటి వారిపై తీవ్రంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్పీ వెంట డీఎస్పీ కంజక్షన్, రిజర్వ్ డీఎస్పీ విజయ్‌కుమార్, సీఐలు, ఎస్ఐలు ఉన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద 144 సెక్షన్ : డీఎస్పీ

హిందూపురం, మే 15 : ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లవద్ద 144వసెక్షన్ అమలులో ఉన్నట్లు డీఎస్పీ కంజక్షన్ తెలిపారు. బిట్ కళాశాల, లేపాక్షి మండలం నాయనపల్లివద్ద భద్రపరిచిన ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌ల సమీపంలో మూడంచెల కేంద్రబలగాలతో పాటు చుట్టూ 144వ సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. ఎవరైనా అతిక్రమించి స్ట్రాంగ్ రూమ్ సమీపంలోకి వెళ్తే వారిపై చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉందన్నారు.

గుండుమల సందర్శన



స్ట్రాంగ్ రూమ్ సమీపాన గుండుమల తిప్పేస్వామి

మడకశిర టౌన్, మే 15: మడకశిర నియోజకవర్గంలో పోలింగ్ పూర్తయిన అనంతరం నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంలను హిందూపురం బిట్ కాలేజ్‌లో స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచారు. టీడీపీ మడకశిర నియోజకవర్గం ఇన్ చార్జ్ గుండుమల తిప్పేస్వామి బుధవారం బిట్ కాలేజీకి వెళ్లి స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించారు. మాజీ సర్పంచి లోకేష్, బీసీసెల్ నాయకులు రామాంజనేయులు, నాయకులు హరికృష్ణ, దినేష్, ప్రకాష్ తదితరులు ఉన్నారు.

మడకశిరలో టీడీపీ గెలుపు ఖాయం

టీడీపీ నాయకులు

గుడిబండ, మే 15 : మడకశిరలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజు గెలవడం తథ్యమని టీడీపీ మండల కన్వీనర్ మద్దనకుంటప్ప, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు మంజునాథ్, క్లస్టర్ ఇన్‌చార్జ్ లక్ష్మీనరసప్ప, భీమరాజ్, నాయకులు దుర్గేష్, షబ్బీర్, శివకుమార్ తదితరులు ఆశాభావం వ్యక్తం చేశారు. వారు బుధవారం విలేకరులతో మాట్లాడుతూ... ఈనెలు 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు ఎన్నడూలేనివిధంగా ఓటు హక్కును వినియోగించుకున్నారని అన్నారు. అధిక శాతం ఓటర్లు టీడీపీవైపు మొగ్గుచూపి సైకిల్ గుర్తుకు ఓటేశారని, నియోజకవర్గంలో ఎన్నడూలేని విధంగా ఈసారి అధిక ఓట్లు పోలయ్యాయన్నారు. జూన్ 4న ఓట్ల లెక్కింపులో టీడీపీ అత్యధిక స్థానాలను గెలుచుకుని చంద్రబాబు ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్ఠించడం ఖాయమన్నారు. రాష్ట్రం అన్నివిధాలా అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

కార్మికుల సేవలు అమోఘం : పావగడ ఎమ్మెల్యే



ఎమ్మెల్యే వెంకటేష్‌ను సన్మానిస్తున్న కార్మికులు

పావగడ, మే 15: కార్మికుల సేవలు ఎంతో త్యాగమైనవని ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేష్ తెలియజేశారు. పట్టణంలోని ఎస్ఎస్‌కే రంగ మందిరంలో బుధవారం నిర్వహించిన కార్మిక దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తన తండ్రి కూడా కార్మికుడిగా పనిచేసి ప్రజల సహకారంతో ప్రజా నాయకుడిగా ఎదిగారని, కష్టపడితే ఫలితం ప్రతి ఒక్కరికి దక్కుతుందని అన్నారు. కార్మిక చట్టం కింద ప్రభుత్వం ప్రతి కార్మికుడికి, వారి పిల్లలకు విద్యా వైద్య సౌకర్యాలకు ఎన్నో కోట్ల నిధులు కేటాయిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈసందర్భంగా కార్మికులంతా కలిసి తమ డిమాండ్లను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. అనంతరం కార్మికులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు.

దరఖాస్తు చేసుకోండి

పావగడ, మే 15: ప్రతిష్ఠిత పాఠశాలల్లో ఆరో తరగతి చేరడానికి ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని పావగ డ సాంఘిక సంక్షేమ శాఖ అధికారి మల్లికార్జునయ్య తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవా రం ఓ ప్రకటన విడుదల చేశారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.2.50లక్షలు లోగా ఉండాలని, బీపీఎల్ కార్డు పొంది ఉండాలన్నారు. విద్యార్థి ఐదో తరగతిలో 60 శాతం మార్కులు పొంది ఉండాలని తెలిపారు. అదేవిధంగా పౌరకార్మికుల పిల్లలు, తల్లిదండ్రులు లేని అనాథలు, నిరాశ్రయులు, మాజీ సైనికుల పిల్లలు, మురికివాడల్లో నివసించే వారి పిల్లలకు మొదటి ప్రాధాన్యత ఉంటుందన్నారు. దరఖాస్తులను ఈ 21వ తేదీలోగా తుమకూరులోని సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

శిథిలావస్థకు చేరుకున్న స్త్రీశక్తి భవనం

అగళి, మే 15 : మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవన నిర్మాణం చేపట్టి 15సంవత్సరాలు కావస్తున్నా... నేటికీ ప్రారంభానికి నోచుకోలేదని మహిళా సంఘం సభ్యులు ఆవేదనవ్యక్తం చేశారు. అగళిలో రూ.28లక్షలతో 15 సంవత్సరాల కిందట స్త్రీశక్తి భవన నిర్మాణం చేపట్టారు. ఇప్పటికీ పూర్తికాలేదు. దీంతో భవనానికి ఏర్పాటు చేసిన కిటికీలు, డోర్లు పగిలిపోయాయి. సమావేశాలు నిర్వహించుకునేందుకు ప్రత్యేక భవనం లేక ఉన్న భవనం లోనే కాలయాపన చేస్తున్నామని మహిళా సంఘాలు అంటున్నారు. అన్ని చోట్ల స్త్రీశక్తి భవనాల నిర్మాణం పూర్తి అవడంతో అందులో విధులు నిర్వహిస్తున్నారు. అగళి మండలంలో మాత్రం నేటికీ భవనం ప్రారంభానికి నోచుకోలేదని, భవనం శిథిలావస్థకు చేరుకుంటోందని అంటున్నారు. అధికారులు వెంటనే స్పందించి శిథిలావస్థకు చేరుకున్న స్త్రీశక్తి భవన నిర్మాణాన్ని పూర్తిచేయించి అందుబాటులోకి తీసుకురావాలని సభ్యులు కోరుతున్నారు.



కూలడానికి సిద్ధంగా ఉన్న స్త్రీశక్తి భవనం